ANN తెలుగు

Follow: @ANNTELUGU

23-06-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 171 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




టాప్ న్యూస్

## చిరంజీవి ఇంటికి స్టేట్ బీజేపీ చీఫ్



మర్యాద పూర్వకమా.. మతలబు ఉందా?

02

## పట్టాపుస్తకాల జారీలో సరికొత్త రికార్డు.



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

02

## లోకేష్ లక్ష్యం అదే



జాతీయ మీడియా ముందు స్పష్టత

02




## సేవ్ మణుగూరు పోరాటాన్ని ఉధృతం చేస్తాం..

06

- పీకే ఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి
- రిలే నిరాహార దీక్షలకు ఎమ్మెల్యే కూనంనేని మద్దతు



## సమస్యలపై సమరం

02

- ఎంజీఆర్ బస్తీబాట
- స్థానిక సమస్యలపై అధికారులకు ఫోన్లు




## వెంకయ్య నాయకుడు విశిష్టజీవన ప్రస్థానంపై నేడు పుస్తకావిష్కరణ

**హైదరాబాద్, మహా :** పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు విశిష్ట జీవన ప్రస్థానంపై సీనియర్ పాత్రికేయుడు మాశర్మ రచించిన "వెంకయ్య 'నాయకుడు' (ఉదయ గిరి నుంచి ఉపరాష్ట్రపతి వరకు)" పుస్తకావిష్కరణ సభ జూన్ 23న జరగనుంది. జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి జి.ఎం.ఆర్. గ్రూపు ఛైర్మన్ గ్రంధి మల్లికార్జున రావు అధ్యక్షత వహిస్తారు. ఈ వేడుకకు గవర్నర్లు కంభంపాటి హరిబాబు, నల్లు ఇంద్రసేనారెడ్డి, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, బండి సంజయ్ సహా పలువురు రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారు.



# ముగ్గురూ.. కలిశారు

## మెట్రో విస్తరణకు లైన్ క్లియర్

కిషన్ రెడ్డితో కలిసి రేవంత్ రెడ్డి.. కేంద్రమంత్రి అశ్వినీవైష్ణవ్ తో భేటీ

ఫలించిన సీఎం రేవంత్ రాజకీయ చతురత

రుణ అడ్డంకులు.. విస్తరణపై సూటిగా అడిగిన సీఎం రేవంత్ రెడ్డి

బహిరంగలేఖల ద్వారా ఒత్తిడి పెంచి.. సాధించిన సీఎం

02

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయండి

- కార్గో.. ఎంఆర్‌వో వసతులు కల్పించాలి
- హ్యాంగర్ ఏర్పాటుకు అత్యంత అనుకూలం
- దేవరకద్రలో డీఆర్‌డీవో ప్రాజెక్టు మంజూరు చేయండి
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి
- గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు భూములు బదలాయించినందుకు కృతజ్ఞతలు తెలిపిన సీఎం

02






వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు

## 100 సీట్లు పక్కా

### బీజేపీకి అనుకూలంగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని విమర్శ

- కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ నేతల పిలుపు
- ఓటర్ల జాబితా సవరణపై బీఎల్‌ఏలకు ప్రత్యేక శిక్షణ
- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హనుమకొండ:** వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ 100 సీట్లు సాధించడం ఖాయమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో ఏఐసీసీ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఓటర్ల జాబితా సవరణపై బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ) శిక్షణ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కనుసన్నల్లోనే ఎన్నికల సంఘం పనిచేస్తోందని, కాంగ్రెస్‌కు నుకూలమైన ముస్లిం, ఎస్సీ, ఎస్టీ వర్గాల ఓట్లను ఎస్ఐఆర్ సాకుతో తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా బీజేపీకి అనుకూల ఓట్లను ఉంచి, మిగిలిన ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ ఏమరపాటుగా ఉండొద్దని, బీఎల్‌ఏలు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు హక్కును కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, కేఆర్ నాగరాజు సహా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉద్ధవ్ సేనకు భారీ షాక్..

- షిండే గూటికి ఆరుగురు ఎంపీలు.
- సక్సెస్ అయిన 'ఆపరేషన్ టైగర్'..
- అనర్హత వేటు నుంచి తప్పించుకున్న వైనం.


02

## ఒకే ఇంట్లో నాలుగు శవాలు

- నల్గొండను కుదిపేసిన మిస్టరీ మరణాలు.
- కుటుంబం అదృశ్యమై రెండు వారాలు.
- మరో యువకుడు మిస్సింగ్..

02






అక్టోబర్ 1న

## ఓటర్ల తుది జాబితా విడుదల

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్.
- జులై 31 నాటికి ముసాయిదా జాబితా ముద్రణ.
- సెప్టెంబర్ 20 వరకు అభ్యంతరాల స్వీకరణ.
- నగరంలో 22 లక్షల మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తి.
- బీఎల్‌వోలతో కలిసి పనిచేయాలని పార్టీలకు పిలుపు.

04



## డేటా సెంటర్ల హబ్‌గా భారత్!

- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్‌తో భారీగా పెరిగిన డిమాండ్.
- ఆసక్తికర విషయాలు వెల్లడించిన గోల్డ్‌మన్ శాక్స్, నైట్ ఫ్రాంక్ నివేదికలు.

02

# రైతులకు అలర్ట్

7 రకాల సన్నాలకే ప్రభుత్వ బోనస్..

- విత్తనాలు కొనే ముందు చూసుకోండి!
- రూ.500 బోనస్ కావాలంటే ప్రభుత్వం సూచించిన రకాలే పండించాలి.
- రేపటి నుంచి రైతు వేదికల్లో విత్తన మేళాలు.
- అవగాహన కల్పించనున్న అధికారులు.
- వానాకాలంలో 38.19 లక్షల ఎకరాల్లో సన్నాల సాగుకు సర్కార్ కసరత్తు.

02





## సమస్యలపై సమరం

# ఎంజీఆర్ బస్తీబాట

**స్థానిక సమస్యలపై అధికారులకు ఫోన్లు**

**ఖైరతాబాద్, మహా :** సమస్యలపై ఆయన సమరం చేస్తున్నారు. బస్తీబాట పేరుతో గల్లీగల్లీ చుట్టేస్తూ.. సమస్యలు చెప్పుకోవడానికి ఎవరివద్దకు వెళ్ళాలో తెలియని పబ్లిక్ క అండాదండయితున్నాడు. ఖైరతాబాద్ డివిజన్ ఇంద్రానగర్ బస్తీలో నెలకొన్న ప్రజా సమస్యలపై ఖైరతాబాద్ నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి సోమవారం వాటర్ వర్క్స్ అధికారంతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. గత కొన్ని నెలలుగా ఇంద్రా నగర్ లో నీటి ఎద్దడి, పొల్యూషన్ వాటర్ సమస్య తీవ్రంగా ఉన్నందున వాటర్ వర్క్స్ అధికారులు మేనేజర్ నదీమ్ , సెక్షన్ ఆఫీసర్ ఆసిఫ్, సెక్షన్ ఆఫీసర్ అంజయ్య , లైన్ మెన్ రవి తో కలిసి వాటర్ లైన్ లో పొల్యూషన్ ఎక్కడుందో తెలుసుకొని మరమ్మత్తు పనులు మొదలుపెట్టించారు. అలాగే స్థానికులు వాటరు ప్రెజర్ రావడం లేదని చెప్పగా, జిహెచ్ఎంసి ఏఈ భరత్ తో ఫోన్లో మాట్లాడి వర్షం నీరు, వాటర్ పొల్యూషన్ అయితున్నందున సమస్య తెలుసుకొని ఫోన్లో వివరించడం జరిగింది. తక్షణమే స్పందించిన ఏఈ రూ. 42 లక్షల తో రోడ్డు, ఆరు క్యాచ్ ఫిట్ వేస్తానని ఎంజీఆర్ కి హామీ ఇచ్చారు అలాగే జిహెచ్ఎంసి ఎస్ ఎఫ్ ఏ అధికారులకు ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఖైరతాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షులు గజ్జల ఆనంద్ , శ్యామ్ గౌడ్, శ్రీనివాస్, బాలు యాదవ్, ఈశ్వర చారి, బలరాం, శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ముగ్గురూ.. కలిశారు



ఢిల్లీ, మహా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై కారాలుమిరియాలు నూరి, బహిరంగసభల్లో దండయాత్ర చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్రరైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమక్షంలో పుష్పగుచ్ఛం ఇచ్చారు. నేను ఢిల్లీ వెళ్తున్నా.. రెండురోజులు ఢిల్లీలోనే ఉంటా. కలిసి కేంద్రమంత్రిని కలుద్దాం.. రా అంటూ బహిరంగలేఖ రాసిన సీఎం రేవంత్ రెడ్డి కలిసి వచ్చేలా చేసుకున్నారు. రాష్ట్రం ముఖ్యమని.. రాజకీయాలు కాదంటూ కిషన్ రెడ్డి కూడా ముందుకొచ్చారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వీనీ వైష్ణవ్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన రైల్వేమంత్రితో రైల్‌భవన్‌లో సమావేశం అయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 అనుమతుల అంశంపై ఆయనతో చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్షించినట్లుగా సమాచారం. ఫలితంగా మెట్రో టేకోవర్, మెట్రో విస్తరణకు సంబంధించి కీలక అడుగుపడింది. ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 అనుమతుల అంశంపై ఆయనతో చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్షించారు. అడ్డంకులు తెలుసుకున్నారు. ఆటంకాలపై సీఎం నేరుగా కేంద్రమంత్రులను ప్రశ్నించినట్లు సమాచారం. ముందుగా రుణాలకు సంబంధించిన అంశంపై స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు తెలిసింది. మెట్రో విస్తరణకు సంబంధించి కేంద్ర కేబినెట్ లో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## లోకేష్ లక్ష్యం అదే జాతీయ మీడియా ముందు స్పష్టత

**ఢిల్లీ, మహా :** 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో పాల్గొన్న ఆయన.. రాష్ట్ర ప్రణాళికలు, అభివృద్ధి వేగాన్ని వివరించారు. పెట్టుబడుల ఆకర్షణకు స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ (3ఎస్) ఫార్ములాను వాడుతున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్పీడ్ బాస్'లా యంత్రాంగాన్ని నడిపిస్తున్నారని తెలిపారు. దేశంలోకి వచ్చే విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయమన్నారు. 2028 నాటికి అమరావతి: కేంద్ర ప్రాజెక్టుకు 37 రోజుల్లోనే 600 ఎకరాలు సేకరించామని, గూగుల్ డేటా సెంటర్‌ను 13 నెలల్లోనే పట్టాలెక్కించామని లోకేశ్ ఉదాహరించారు. రూ.60,000 కోట్లతో అమరావతిని సెల్ఫ్‌ఫైనాన్సింగ్ మోడల్‌లో నిర్మిస్తున్నామని, 2028 నాటికి కోర్ క్యాపిటల్ సిద్ధమవుతుందని హామీ ఇచ్చారు. మూడు ఆర్థిక హబ్‌లు: వైజాగ్‌ను ఐటీ హబ్‌గా, అమరావతిని నాలెడ్జ్ హబ్‌గా, రాయలసీమను మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి గెలిచిన యువ ఎమ్మెల్యేలే ఉన్నారని, పార్టీలో లీడర్‌షిప్ షిఫ్ట్ విజయవంతంగా జరుగుతోందని లోకేశ్ పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేయండి

**ఢిల్లీ, మహా :** భారత వాయు సేన ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి భూసేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న ఎయిర్‌పోర్ట్ దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున, దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకరిస్తామని రక్షణశాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఇటీవల మధ్య ఆసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి సరైన ప్రదేశాలను అన్వేషిస్తున్నాయని, హ్యాంగర్ ఏర్పాటుకు ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైనందున ఆ దిశగా అభివృద్ధి చేయాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తమ కీలకమైన ప్రాజెక్టు ఏర్పాటుకు డీఆర్‌డీవో/డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందున ఆ ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ వికాస్‌రాజ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

# ఉద్ధవ్ సేనకు భారీ షాక్..



**ముంబయి, మహా :** మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రేకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆయన నేతృత్వంలోని శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు లోక్‌సభ సభ్యులు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరారు. దీంతో గత కొంతకాలంగా రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'ఆపరేషన్ టైగర్' విజయవంతంగా ముగిసినట్లయింది. ఒకేసారి సగానికి పైగా ఎంపీలు పార్టీని వీడటం ఉద్ధవ్ థాక్రేకు మింగుడుపడని పరిణామంగా మారింది.

సోమవారం (జూన్ 22న) ఏక్‌నాథ్ షిండే సమక్షంలో ఆరుగురు ఎంపీలు అధికారికంగా శివసేన (షిండే) తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ మారిన వారిలో సంజయ్ హరిభౌ జాదవ్, భౌసాహెబ్ రాజారామ్ వాక్‌చౌరే, ఓంప్రకాష్ భూపాల్‌సింగ్ నింబాల్కర్, సంజయ్ దీనా పాటిల్, సంజయ్ ఉత్తమ్‌రావ్ దేశ్‌ముఖ్, నగేష్ బాపురావ్ పాటిల్ అస్తికర్ ఉన్నారు. వీరికి షిండే సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమదే అసలైన శివసేన పార్టీ అని ఉద్ఘాటించారు. బాల్ థాక్రే ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లేది తామేనని స్పష్టం చేశారు. ఉద్ధవ్ వర్గం నుంచి ఈ ఆరుగురు నేతలు తమతో కలిసి రావడం తమకు మరింత బలాన్ని, పెద్ద ఊరటను చేకూర్చిందని ఆనందం వ్యక్తం చేశారు. "ఇప్పుడు ఇక్కడ ఒక్క పులి కాదు.. ఆరుగురు పులులు ఉన్నారు" అంటూ ఆపరేషన్ టైగర్‌ను పరోక్షంగా ప్రస్తావిస్తూ షిండే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**అనర్హత వేటుకు అవకాశం లేదు..**

తాజా రాజకీయ పరిణామాలతో ఈ ఆరుగురు ఎంపీలపై అనర్హత వేటు పడుతుందా అన్న చర్చ మొదలైంది. అయితే వారికి చట్టపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. శివసేన (యూబీటీ)కి లోక్‌సభలో మొత్తం తొమ్మిది మంది సభ్యులు ఉన్నారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం.. ఎంపీలపై అనర్హత వేటు పడకుండా ఉండాలంటే మూడింట రెండు వంతుల (2/3) మెజారిటీ సభ్యులు వేరే పార్టీలో విలీనం కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉద్ధవ్ సేనకు ఉన్న తొమ్మిది మందిలో సరిగ్గా మూడింట రెండు వంతుల మంది, అనగా ఆరుగురు ఎంపీలు ఒకేసారి షిండే వర్గంలో చేరారు. చట్టప్రకారం అవసరమైన మెజారిటీ ఉండటంతో ఈ ఆరుగురు ఎంపీలు అనర్హత వేటు నుంచి సులభంగా తప్పించుకున్నట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# చిరంజీవి ఇంటికి స్టేట్ బీజేపీ చీఫ్


**మర్యాదపూర్వకమా.. మతలబు ఉందా?**

హైదరాబాద్, మహా : మెగాస్టార్ చిరంజీవితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశం జరిగిన కొద్దిసేపటికే అందుకు సంబంధించిన ఫోటోలు బయటకు రావడంతో అటు పొలిటికల్ సర్కిల్‌లో, ఇటు సోషల్ మీడియా వేదికల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ.. కేవలం సినిమాలకే పరిమితమైన మెగాస్టార్ చిరంజీవిని బీజేపీ ముఖ్య నేత కలవడం వెనుక ఉన్న అసలు కారణాలపై రకరకాల విశ్లేషణలు మొదలయ్యాయి.అయితే, ఈ భేటీ వెనుక ఉన్న కారణాన్ని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం విజయవంతంగా 12 ఏళ్ల సుదీర్ఘ పాలనను పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్' పేరిట ఒక ప్రత్యేక ప్రజా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. మోదీ ప్రభుత్వం సాధించిన చారిత్రాత్మక విజయాలు, దేశ రక్షణ, ఆర్థిక రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను సమాజంలోని వివిధ రంగాల ప్రముఖులకు వివరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అందులో భాగంగానే రామచందర్ రావు మెగాస్టార్‌ను కలిసి.. మోదీ 12 ఏళ్ల పాలనా ప్రగతికి సంబంధించిన ఒక స్పెషల్ బుక్, బ్రోచర్లను చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా దేశ ఆర్థిక పురోగతి, వివిధ రంగాల అభివృద్ధిపై ఇరు ప్రముఖుల



మధ్య కాసేపు ఆసక్తికర చర్చ సాగినట్లు సమాచారం. ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకమైనదని, ప్రభుత్వ విజయాలను వివరించడానికే తాము మెగాస్టార్‌ను కలిశామని బీజేపీ నేతలు పైకి చెప్తున్నప్పటికీ.. అంతర్గతంగా మాత్రం రాజకీయ సమీకరణాల చర్చ జోరందుకుంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి ఆ తర్వాత కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేసిన చిరంజీవికి రాజకీయాలపై అపారమైన అనుభవం ఉంది. ఆ తర్వాత ఆయన పాలిటిక్స్‌కు గుడ్ బై చెప్పి మళ్లీ సినిమాల్లో బిజీ అయ్యారు. ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్న చిరు.. ఈ భేటీ ద్వారా మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి రీఎంట్రీ ఇస్తారా..? ఒకవేళ వస్తే కాషాయ జెండా కప్పుకునే అవకాశం ఉందా? అనే ఊహాగానాలు జోరందుకున్నాయి.

ఈ చర్చకు మరో ప్రధాన కారణం చిరు సదరుడు, జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పటికే కేంద్రంలోని ఎన్డీయే కూటమిలో కీలకమైన భాగస్వామిగా కొనసాగుతున్నారు. అటు ఏపీ ప్రభుత్వంలోనూ భాగస్వామిగా ఉన్నారు. తమ్ముడు పవన్ కళ్యాణ్ మోదీ ప్రభుత్వంతో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న నేపథ్యంలో.. తాజా రాజకీయ సమీకరణాలు అన్న చిరంజీవిని కూడా బీజేపీ వైపు ఆకర్షిస్తున్నాయా? అనే కోణంలో విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే ఇది మర్యాదపూర్వక భేటీనా.. లేక ఇటు బీజేపీకి, అటు చిరంజీవికి మైలేజ్ ఇచ్చే సమావేశమా? అనేది తేలాల్సి ఉంది.



## ఒకే ఇంట్లో నాలుగు శవాలు

**నల్గొండ, మహా :** జిల్లా కేంద్రంలోని శ్రీనివాస కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కుళ్లిన స్థితిలో శవాలై కనిపించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గిరి శ్రీకాంత్, భార్య లక్ష్మి, పిల్లలు హర్షిత, సాయిచరణ్ రెండు వారాల క్రితం అదృశ్యం కాగా, తాజాగా వారి ఇంట్లోనే మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇంట్లో లభించిన సూసైడ్ నోట్ ఆధారంగా మొదట ఆత్మహత్యగా భావించినా, కుటుంబానికి చెందిన మరో యువకుడు ప్రస్తుతం పరారీలో ఉండటంతో హత్య కోణంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పుల బాధ, కుటుంబ కలహాలు లేదా మరేదైనా కారణమా అనే కోణంలో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న యువకుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. పోస్ట్‌మార్టం నివేదిక వస్తేనే మరణాల వెనుక అసలు మిస్టరీ వీడనుంది.

# రైతులకు అలర్ట్

**హైదరాబాద్, మహా :**తెలంగాణలోని అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం కీలక సూచన చేసింది. రాబోయే వానాకాలం సీజన్‌లో వరి సాగు చేసే రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని కోరింది. రాష్ట్రంలో రైతులు సాధారణంగా 33 రకాల సన్న వడ్లను సాగు చేస్తుండగా, ఈసారి వాటిల్లో కేవలం 7 రకాల విశిష్ట సన్న వరి రకాలకు మాత్రమే ప్రభుత్వ బోనస్ అందించాలని సర్కారు యోచిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే కనీస మద్దతు ధరకు అదనంగా క్వింటాకు రూ.500 చొప్పున ఇచ్చే బోనస్ ఈ ఏడు రకాలకే వర్తించనుంది. ఈ నేపథ్యంలో రైతులు ఏ రకాలు పండించాలనే దానిపై స్పష్టతనిస్తూ, ఈనెల 23వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు వేదికల్లో ప్రత్యేక విత్తన మేళాలు నిర్వహించి అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, ప్రైవేటు మిల్లర్ల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులను దూరం చేయడంతో పాటు, అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్‌ను బట్టి ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం బోనస్ వర్తింపజేయాలని భావిస్తున్న ఆ 7 రకాల సన్న వడ్ల వివరాలు ఇలా ఉన్నాయి. 120 నుంచి 125 రోజుల పంట కాలంతో, అగ్గితెగులు (బ్లాస్ట్) తట్టుకునే 'తెలంగాణ సోన (RNR15048)', 145150 రోజుల పంట కాలంతో ఎగుమతులకు అనుకూలంగా ఉండే సుగంధభరిత 'సాంబ మసూరి (BPT5204)', వ్యాధి నిరోధక శక్తి కలిగిన 'KNM1638' రకాలు ఇందులో ఉన్నాయి. వీటితో పాటు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్, అద్భుతమైన రుచి ఉండే 'హెచ్‌ఎంటీ సోన', వర్షాకాలం, యాసంగి రెండింటికీ అనుకూలం




గా ఉండి అధిక దిగుబడినిచ్చే 'జైశ్రీరాం', అన్ని రకాల నేలల్లో స్థిరమైన దిగుబడినిచ్చే 'VGL44' మరియు మార్కెట్‌లో మంచి క్రేజ్ ఉన్న 'KNM7715' రకాలకు మాత్రమే ఈ బోనస్ లభించనుంది.

ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వినియోగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి సన్నాల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వానాకాలం సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1.34 కోట్ల ఎకరాల్లో సాగు సాగాల్సి ఉండగా, అందులో 69 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేశారు. ఈ వరి సాగులో దాదాపు 38.19 లక్షల ఎకరాల్లో కేవలం ఈ 7 రకాల సన్నాలనే పండించేలా రైతులను ప్రోత్సహించనున్నారు. గత సీజన్‌తో పోలిస్తే ఈసారి సన్నాల సాగు విస్తీర్ణాన్ని మరో 10.31 లక్షల ఎకరాలకు పెంచడం గమనార్హం. దీనికి సంబంధించిన సబ్సిడీ, బోనస్, విత్తనాల లభ్యత తదితర మార్గదర్శకాలతో కూడిన నివేదికను వ్యవసాయ శాఖ ఇప్పటికే మంత్రిమండలి ఆమోదానికి పంపింది.

విత్తనాల సబ్సిడీ పొందేందుకు ప్రభుత్వం ఒక కొత్త నిబంధనను తీసుకువచ్చింది. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ముందుగా పూర్తి ధర చెల్లించాల్సి ఉంటుంది. వారు కొన్న విత్తనాల బిల్లులను పంట కాలం ముగిసే వరకు అత్యంత భద్రంగా దాచుకోవాలి. పంట సాగులో ఉన్నప్పుడు వ్యవసాయ విస్తరణాధికారి క్షేత్రస్థాయిలో సదరు రైతు పొలాన్ని సందర్శిస్తారు. ప్రభుత్వం సూచించిన విత్తనాలనే రైతు సాగు చేశాడని ఏఈవో ధ్రువీకరించిన తర్వాతే, విత్తన సబ్సిడీ సొమ్ము నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతుందని అధికారులు స్పష్టం చేశారు.

# పట్టాపుస్తకాల జారీలో సరికొత్త రికార్డు

**హైదరాబాద్, మహా.** రాష్ట్రంలోని రైతుల భూములకు పూర్తి స్థాయి చట్టబద్ధమైన రక్షణ కల్పించడంతో పాటు, ఎవరికీ ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్పష్టమైన యాజమాన్య హక్కులు అందించడమే తమ ప్రజా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. దశాబ్దాలుగా రైతాంగాన్ని పీడిస్తున్న భూ సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో, ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఆయన ఉద్ఘాటించారు. సోమవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో ఆయన ప్రత్యేక టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో అమలవుతున్న నూతన సంస్కరణలను, చట్టాల పనితీరును ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. గతంలో ఒక చిన్న పాస్‌పుస్తకం కోసం అన్నదాతలు నెలల తరబడి, చెప్పులు అరిగేలా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఆ కష్టాలకు శాశ్వత ముగింపు పలికిందని మంత్రి పొంగులేటి హర్షం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మకమైన 'భూ భారతి' చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14వ తేదీ నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 3.65 లక్షల పట్టాదారు పాస్‌పుస్తకాలను రికార్డు స్థాయిలో జారీ చేసినట్లు ఆయన వెల్లడించారు. రైతు దరఖాస్తు చేసుకున్న వెంటనే, ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా, అత్యంత వేగవంతంగా పాస్‌పుస్తకం వారి చేతికి అందేలా రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేశామన్నారు. అన్నదాత ఒక్కసారి దరఖాస్తు చేస్తే చాలు.. పనులు పూర్తి చేసుకుని వెళ్లేలా అధికారుల పనితీరు ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులను ఇబ్బంది పెట్టకూడదని ఆయన కఠిన ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో పొందుపరిచిన నిబంధనల ప్రకారం.. వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సర్వే మ్యాప్‌ను తప్పనిసరిగా జత చేసే



విధానంపై మంత్రి సమీక్షించారు. కొనుగోలు, అమ్మకాల సమయంలో భవిష్యత్తులో ఎలాంటి సరిహద్దు వివాదాలు రాకుండా ఉండేందుకు ప్రస్తుతం ఈ సరికొత్త విధానాన్ని రాష్ట్రంలోని ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని, ఇది అత్యంత విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద అమలవుతున్న ఈ ఐదు మండలాల్లో ఎదురైన క్షేత్రస్థాయి అనుభవాలను, చిన్నచిన్న సమస్యలను పరిగణనలోకి తీసుకుని లోపాల్లేని వ్యవస్థను తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు. త్వరలోనే రెండో దశ కింద రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని ఎంపిక చేసి, అక్కడ సర్వే మ్యాప్‌లతో కూడిన రిజిస్ట్రేషన్ల విధానాన్ని పక్కాగా అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆరు లక్షల సాదాబైనామాలకు నోటీసులు**

రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ఆశగా ఎదురుచూస్తున్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కార ప్రక్రియలో మరింత వేగం పెంచాలని మంత్రి అధికారులకు నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులు ఉండగా, ఇప్పటి వరకు ఆరు లక్షల మంది దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి.. మిగిలిన దరఖాస్తులన్నింటికీ రాబోయే 15 రోజుల్లోగా నోటీసులు జారీ చేయాలని గడువు విధించారు. నోటీసులు ఇచ్చిన తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే, అర్హులైన రైతుల దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి వారికి న్యాయం జరిగేలా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే సాదాబైనామా సమస్య ఇంత జటిలమైందని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విమర్శించారు. గత ప్రభుత్వం హడావుడిగా దరఖాస్తులను స్వీకరించినప్పటికీ, వాటి పరిష్కారానికి సంబంధించి 2020 ఆర్వోఆర్ చట్టంలో ఎలాంటి స్పష్టమైన నిబంధనలు పొందుపరచలేదని మండిపడ్డారు. సరైన మార్గదర్శకాలు లేకపోవడం వల్లనే వేలాది మంది అమాయక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల గోడును అర్థం చేసుకున్న తమ ప్రజా ప్రభుత్వం.. వెంటనే ఆ చట్టంలోని లోపాలను సరిదిద్ది, నిబంధనలను సవరించి దరఖాస్తుదారులకు సంపూర్ణ న్యాయం జరిగేలా పటిష్టమైన చర్యలు చేపట్టిందని ఆయన స్పష్టం చేశారు.

## లఖ్‌నవూ అగ్నిప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి

**ఢిల్లీ, మహా.** ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాద ఘటన పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. నగరంలోని అలీగంజ్ ప్రాంతంలో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఈ ప్రమాదంలో సుమారు 14 మంది ప్రాణాలు కోల్పోవడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనను, విషాదాన్ని నింపింది. ఈ హృదయ విదారక ఘటనలో తమ ఆత్మీయులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రధానమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన వారు సాధ్యమైనంత త్వరగా కోలుకుని ఇళ్లకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఊహించని విపత్తు నేపథ్యంలో బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం ప్రకటించింది. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్‌ఆర్‌ఎఫ్) నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు ప్రధాని వెల్లడించారు. అలాగే, ఈ దుర్ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరికీ రూ.50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్లు ఆయన ప్రకటించారు. దుర్ఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరంగా పర్యవేక్షిస్తోంది.

# షీర్‌వాల్ టెక్నాలజీతో ఇంటి నిర్మాణాలు

- **రెండో విడతలో గుడిసెవాసులకే పెద్దపీట!**
- **రాష్ట్రవ్యాప్తంగా 24 వేల పూరిళ్ల గుర్తింపు.**
- **నిర్మాణ వ్యయానికి చెక్ పెట్టేలా సర్కారు ప్రణాళికలు.**



**హైదరాబాద్, మహా :** పేద, మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ఇందిరమ్మ ఇళ్ల' పథకం రెండో విడతకు ముమ్మరంగా సన్నాహాలు జరుగుతున్నాయి. మొదటి విడత కింద ఇప్పటికే ఇళ్లను మంజూరు చేసి నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం.. రెండో విడతలో నిరుపేదలకు, ముఖ్యంగా పూరి గుడిసెల్లో నివసించే వారికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. వీరికి కేవలం 15 రోజుల్లోనే పక్కా ఇంటిని నిర్మించి ఇచ్చేలా అత్యాధునిక 'షీర్వాల్' టెక్నాలజీని వినియోగించేందుకు రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ (హౌసింగ్ కార్పొరేషన్) ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తోంది.

ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత సర్వే చేపట్టారు. ఈ సర్వేలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 24 వేల మంది నిరుపేదలు ఇంకా పూరి గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీరికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కింద మొదటి ప్రాధాన్యత కల్పించనున్నారు. సాధారణంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుంది. కానీ ప్రస్తుత మార్కెట్లో ఇసుక, సిమెంట్, ఇటుక, ఐరన్ వంటి నిర్మాణ సామాగ్రి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే ఐదు లక్షలకు తోడు లబ్ధిదారులు అదనంగా డబ్బులు వెచ్చించాల్సి వస్తోంది. రెక్కాడితే గానీ డొక్కాడని గుడిసెవాసులు ముందుగా పెట్టుబడి పెట్టి ఇల్లు నిర్మించుకునే పరిస్థితి లేకపోవడంతో, ప్రభుత్వమే షీర్వాల్ విధానంలో ఇళ్లను నిర్మించి ఇవ్వాలని నిర్ణయానికి వచ్చింది.

షీర్వాల్ టెక్నాలజీ ద్వారా ఇంటి నిర్మాణ వ్యయం భారీగా తగ్గడమే కాకుండా, పనులు అత్యంత వేగంగా పూర్తవుతాయి. 22.3 అడుగుల పొడవు, 18 అడుగుల వెడల్పుతో మొత్తం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నమూనా ఇంటిని డిజైన్ చేశారు. నిర్మాణంలో ఇటుకల వాడకం లేకుండా 8ఎంఎం, 10ఎంఎం స్టీల్, రెడీమిక్స్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్, అల్యూమినియం ప్యానెల్స్‌ను విరివిగా ఉపయోగిస్తారు. ఈ పద్ధతిలో పునాది వేయడానికి ఐదు రోజులు, శ్లాబ్ నిర్మాణానికి ఆరు రోజులు, ప్లాస్టరింగ్ తదితర పనులకు మరో నాలుగు రోజులు పడుతుంది. మొత్తంగా కేవలం 15 రోజుల్లోనే సర్వాంగ సుందరమైన ఇల్లు ముస్తాబవుతుంది. దీనికయ్యే ఖర్చు కూడా బడ్జెట్ పరిమితుల్లోనే ఉండటం గమనార్హం.

ఈ నూతన సాంకేతికత ఇప్పటికే క్షేత్రస్థాయిలో విజయవంతంగా పరీక్షించబడింది. గతేడాది సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ఓ స్టార్టప్ కంపెనీ 400 చదరపు అడుగుల్లో ఈ తరహా నమూనా ఇంటిని నిర్మించి విజయం సాధించింది. అలాగే, ఇటీవల కుమురం భీం జిల్లా కెరమెరి మండలం కొరారి పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో కూడా షీర్వాల్ టెక్నాలజీతో ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందజేశారు. ఈ ప్రయోగాలు సత్ఫలితాలు ఇవ్వడంతో, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన గుడిసెవాసులందరికీ ఇదే పద్ధతిలో సురక్షితమైన, నాణ్యమైన ఇళ్లను నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతోంది.

# రైళ్లలో భిక్షాటన చేస్తే రూ.2 వేల జరిమానా



**హైదరాబాద్, మహా** రైల్వే ప్రయాణికుల భద్రత, రైల్వే ప్రాంగణాల్లో క్రమశిక్షణను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా 1989 నాటి రైల్వే చట్టంలో పలు కీలక సవరణలు చేస్తూ 'జన విశ్వాస్' పేరిట సరికొత్త నిబంధనలను తీసుకువచ్చింది. రైళ్లు, రైల్వే స్టేషన్లలో అనధికారికంగా తిష్టవేసే ఆకతాయిలు, భిక్షాటన చేసేవారు, అనుమతి లేకుండా తినుబండారాలు అమ్మే చిరువ్యాపారుల వల్ల ప్రయాణికులు నిత్యం ఎదుర్కొంటున్న ఇబ్బందులకు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఈ భారీ జరిమానాలను ఖరారు చేశారు. సవరించిన ఈ నూతన చట్టాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను ఆదివారం కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఆర్పీఎఫ్ సీఐ ఛటర్జీ, ఎస్సై వెంకట్‌రెడ్డి సంయుక్తంగా విడుదల చేశారు.

**నిబంధనల ఉల్లంఘనలపై విధించే సవరించిన జరిమానాల వివరాలు ఇలా ఉన్నాయి:**

రైల్వే అధికారుల నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా స్టేషన్లలో, రైళ్లలో తినుబండారాలు అమ్మే హ్యాకర్లకు, అలాగే భిక్షాటన చేసే వారికి ఇకపై రూ. 2,000 భారీ జరిమానా విధించనున్నారు. అత్యంత కీలకమైన మహిళల రిజర్వ్ కోచ్‌లలోకి పురుషులు ప్రవేశిస్తే రూ. 2,500 జరిమానా విధిస్తారు. రైల్వే ప్రాంగణంలో లేదా రైలు బోగీల్లో ధూమపానం (స్మోకింగ్) చేస్తూ పట్టుబడితే రూ. 2,000, స్టేషన్లలోకి లేదా రైళ్లలోకి ప్రమాదకరమైన వస్తువులను తీసుకువస్తే ఏకంగా రూ. 10,000 జరిమానా విధించాలని నిర్ణయించారు. మరోవైపు, రిజర్వేషన్ లేని ప్రయాణికులు అనుమతి లేకుండా రిజర్వ్డ్ కోచ్‌లలో ప్రవేశిస్తే రూ. 2,000, ఒకవేళ తాము కూర్చున్న రిజర్వ్ బెర్తును అసలైన ప్రయాణికుడి కోసం ఖాళీ చేయడానికి నిరాకరిస్తే రూ. 1,000 చొప్పున జరిమానా వసూలు చేస్తారు. రైల్వే ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించే వారికి రూ. 1,000 నుంచి రూ. 2,000 వరకు, రైల్వే ఆవరణలోకి అనధికారికంగా ప్రవేశించినా, రైల్వే ట్రాఫిక్ సిగ్నళ్లను ఉల్లంఘించినా రూ. 500 చొప్పున ఫైన్ వేస్తారు. అలాగే, టికెట్ లేకుండా ప్రయాణించడం, అనుమతించిన దూరానికి మించి ప్రయాణించడం, ఇతరుల టికెట్లతో ప్రయాణించడం లాంటి తప్పులకు పాల్పడితే అసలు ప్రయాణ ఛార్జీలతో పాటు అదనంగా రూ. 500 పెనాల్టీ వసూలు చేయనున్నారు. ఈ సరికొత్త నిబంధనల ప్రకారం ఉల్లంఘనదారుల నుంచి జరిమానా రుసుములను అక్కడికక్కడే వసూలు చేసి, వారికి అధికారిక రసీదు (ఫామ్) అందజేస్తారు. ఒకవేళ ఎవరైనా జరిమానా చెల్లించడానికి నిరాకరిస్తే, వారిపై రైల్వే పోలీస్ స్టేషన్‌లో తక్షణమే కేసు నమోదు చేసి, అనంతరం కోర్టులో హాజరుపరుస్తారు. గతంలో ఆర్పీఎఫ్ అధికారులకు నేరుగా ఇలాంటి జరిమానాలు వసూలు చేసే చట్టపరమైన అధికారాలు ఉండేవి కావు. కానీ, మారిన కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ జూన్ 15వ తేదీ నుంచే ఆర్పీఎఫ్ అధికారులకు ఈ ప్రత్యేక అధికారాలు కల్పించడంతో క్షేత్రస్థాయిలో తనిఖీలను మరింత ముమ్మరం చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

# అక్టోబర్ 1న ఓటర్ల తుది జాబితా విడుదల

**హైదరాబాద్, మహా :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా రాబోయే జులై 31వ తేదీ నాటికి ఓటర్ల ముసాయిదా జాబితాను ముద్రిస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారికంగా వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించి కీలక వివరాలను మీడియాకు వెల్లడించారు. జులై ఆఖరుకు ముసాయిదా సిద్ధం చేసిన అనంతరం, సెప్టెంబర్ 20వ తేదీ వరకు ఓటర్ల నుంచి అభ్యంతరాలు, కొత్త దరఖాస్తులు, మార్పులు చేర్పులకు సంబంధించిన విజ్ఞప్తులను స్వీకరిస్తామని స్పష్టం చేశారు. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత అక్టోబర్ 1వ తేదీన ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తామని కమిషనర్ ప్రకటించారు. నగర పరిధిలో ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణలో భాగంగా చేపట్టిన మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని కమిషనర్ తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 22 లక్షల మందికి పైగా ఓటర్ల మ్యాపింగ్‌ను విజయవంతంగా పూర్తి చేశామని, మిగిలిన మరో 25 లక్షల మంది ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఓటర్ల సవరణ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం కూడా ఎంతో కీలకమని, బీఎల్‌వోలతో పాటు అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్లు చురుగ్గా పాల్గొని ఓటర్ల నమోదు, సవరణలు సక్రమంగా జరిగేలా సహకరించాలని ఆర్.వి. కర్ణన్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# మృతుని కుటుంబానికి బియ్యం వితరణ



కారేపల్లి, మహా :కారేపల్లి మండలం చిన్న కట్టుగూడెం లో ఇటివల మృతి చెందిన బానోత్ భద్రి కుటుంబానికి సోమవారం కొత్తతండా సర్పంచ్ దారావత్ మంగీలాల్ బియ్యం వితరణ చేశారు. బానోత్ భద్రి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న సర్పంచ్ మంగీలాల్ కట్టుగూడెంలోని మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యంను అందజేశారు. సర్పంచ్ ఔదర్యానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సూచనతో భద్రి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు 50 కేజీల బియ్యంను అందజేశారు. ఈకార్యక్రమంలో దిశా కమిటీ మాజీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్, కొత్తతండా, గుంపెల్లగూడెం ఉపసర్పంచ్ లు రవి, శంకర్, కాంగ్రెస్ నాయకులు దారావత్ వినోద్, భూక్య సైదులు, బానోత్ కిషన్, దారావత్ భాస్కర్, భూక్య వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# కిరాణా దుకాణాలకు సర్పంచ్ అల్టిమేటం జారీ

- **మైనర్లకు సిగరెట్లు, గుట్కాలు అమ్మకుండా నిషేధం**
- **అమ్మినట్టు రుజువైతే 5000/ జరిమానా**
- **యువత సరైన మార్గంలో భవిష్యత్తు ను నిర్మించుకోవాలని సూచన**



**బెల్లంపల్లి, మహా:** తాండూరు మండలం మాదారం గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్ లో సభ్యుల ఆమోదంతో గ్రామ సర్పంచ్ కృష్ణ పల్లి లక్ష్మణ్ కిరాణా దుకాణాలకు మైనర్లకు గుట్కాలు సిగరెట్లు విక్రయించరాదని అల్టిమేటం జారీ చేశారు. కిరాణా దుకాణాల్లో చిన్నపిల్లకు (18సం. లోపు) సిగరెట్లు, గుట్కాలు విక్రయించడాన్ని తప్పు పడుతూ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో కిరాణా దుకాణాలపై ఆంక్షలు విధిస్తూ తీర్మానం చేశారు. తీర్మానంలో కిరాణా దుకాణాల్లో 18సం.లోపు పిల్లలకు సిగరెట్లు మరియు గుట్కాలు అమ్మినట్టు రుజువైతే 5000/ రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని, దుకాణా లైసెన్స్ లు రద్దు చేసి అని చట్టపరమైన చర్యలకు సంబంధిత అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆదివారం రోజున బేతి రఘునాథ్ రెడ్డి ఇచ్చిన వినతి పత్రం మేరకు యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా కిరాణా దుకాణాలపై ఆంక్షలు పెట్టాలని సూచించారని తమకు గతంలో కూడా మా దృష్టికి వచ్చిందని వెల్లడించారు. కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులను కూడా మందలించడం జరిగిందని గుర్తు చేశారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తీసుకోవాల్సిన చర్యలను గ్రామ సభలో వార్డు సభ్యుల సమక్షంలో చర్చించి తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ తీర్మానం ప్రతిని ప్రతి కిరాణం దుకాణాల్లో ఇవ్వడం జరుగుతుందని నియమానాలు ప్రతి దుకాణదారుడు విధిగా పాటించాలన్నారు .

## బూర్గంపహాడ్‌లో విత్తన మేళా

బూర్గంపహాడ్, మహా : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బూర్గంపహాడ్ మండలంలోని అన్నిరైతు వేదికల్లో జూన్ 23 నుంచి 30 వరకు ప్రత్యేకంగా విత్తన మేళా నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు. మేళాలో అధిక దిగుబడినిచ్చే వివిధ రకాల వరి, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, డీఏపీ తదితర ఎరువులను సబ్సిడీ ధరలకు రైతులకు అందించనున్నారు. అలాగే డ్రోన్ స్ప్రేయింగ్, సేంద్రీయ వ్యవసాయం, సూక్ష్మ పోషకాల వినియోగం వంటి అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ మేళాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని అధికారులు కోరారు.

## సింగరేణి ఎంపిడివో గ పద్మ

**కారేపల్లి, మహా:** సింగరేణి మండల పరిషత్ రెగ్యులర్ ఎంపీడీవో గా బీ.పద్మ నియమితులైనారు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు లో ఎంపీవోగా పని చేసిన పద్మ పదోన్నతిపై సింగరేణి మండల ఎంపీడీవోగా నియమితులై సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సింగరేణి మండల ఎంపీడీవో పని చేసిన పీ.శ్రీనివాసరావు ఖమ్మం డిప్యూటీ సీఈవో గా వెళ్ళటంతో అప్పటి నుండి ఇంచార్జీ ఎంపీడీవోగా ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ పని చేస్తున్నారు. ఆయన నూతన ఎంపీడీవో పద్మకు చార్జీ అప్పగించారు. నూతన ఎంపీడీవో ను మండలంలోని సర్పంచ్ లు కలిసి శాలువ కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్, సర్పంచ్ లు దండు ప్రవీణ్, ఈసం మోతీరస్వామి, కల్తి భద్రయ్య, మాలోత్ స్వామి, రమేష్, ఎంపీడీవో సూపర్నిటెండెంట్ మల్లెల రమేష్, ఆరోడబ్ల్యూఎస్ ఏఈ నరేందర్ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



**బూర్గంపహాడ్, మహా :** విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం బూర్గంపహాడ్ మండలంలోని తెలంగాణ అల్పసంఖ్యాక గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన కిచెన్ షెడ్, స్టోర్‌రూమ్, వసతి గృహాలను పరిశీలించారు. వంటశాల, భోజనశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, ఆహార పదార్థాల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి విద్య, వసతి, భోజనం తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మోరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజీనామా

**దమ్మపేట, మహా :** బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులు పైడి వెంకటేశ్వరరావు, దొడ్డాకుల రాజేశ్వరరావు సోమవారం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా లేఖను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్‌కు అందజేశారు. గతంలో జడ్పీటీసీగా సేవలందించిన పైడి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడిగా పనిచేసిన దొడ్డాకుల రాజేశ్వరరావు ఒకేరోజు రాజీనామా చేయడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరూ ఎన్నో ఏళ్లుగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అత్యంత సన్నిహిత అనుచరులుగా గుర్తింపు పొందారు.

గత ఎన్నికల అనంతరం తుమ్మల కాంగ్రెస్‌లో చేరగా, వీరు మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగారు. అయితే పలు సందర్భాల్లో తుమ్మలకు అనుకూలంగా వ్యవహరించడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. తాజాగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో వీరి రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. తుమ్మల నాగేశ్వరరావు వెంట కాంగ్రెస్‌లో చేరే అవకాశాలున్నాయనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది.

## కంది శ్రీనివాస రెడ్డి కృషితో బీజీఆర్ ఏజెన్సీకి కాంట్రాక్ట్

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి లో రోగుల భోజనం కాంట్రాక్టు బీజీఆర్ ఏజెన్సీ కి దక్కింది. దీనికోసం 12 మంది దరఖాస్తు చేసుకోగా స్థానికులకే అవకాశం దక్కాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పట్టు బట్టి మరీ ఇప్పించారు .ఇంత కాలం స్థానికేతరులు ఆసుపత్రి లోని రోగులకు భోజన వసతి నిర్వహించేవారు. కానీ ఇప్పుడు కంది శ్రీనివాస రెడ్డి కృషి ద్వారా బీజీఆర్ ఏజెన్సీకి కాంట్రాక్ట్ దక్కింది ఈ జులై నుండి ఏజెన్సీ ద్వారా రెండు సంవత్సరాల పాటు రోగులకు నాణ్యమైన భోజనం అందిస్తారని ఆయన ఆకాంక్షించారు. స్థానికులకే ఈ కాంట్రాక్ట్ రావటంతో రోగులకు మంచి భోజన వసతి ఉంటుందని ఆశిస్తున్నారు.




# మాజీ కార్పొరేటర్ స్మారకార్థం జిల్లా స్థాయి జూడో పోటీలు

- **ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ కార్పొరేటర్లు**
- **క్రీడాకారులకు క్రీడా దుస్తులు, మెడల్స్ అందజేసిన కావటి కవిత**


**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ నగరం లోని కెమిస్ట్రీ భవన్ నందు కీ.శే మాజీ కార్పొరేటర్ కావటి రాజు యాదవ్ స్మారకార్థం జిల్లా స్థాయి జూడో పోటీలు సోమవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ జూడొ అసోసియేషన్ ప్రెసిడెంట్ బైరవైన కైలాష్ యాదవ్, బి వై ఎస్ ఓ అనిల్ కుమార్, మాజీ కార్పొరేటర్లు కావటి కవిత రాజు యాదవ్, సురేష్ జోషి, బస్వరాజు కుమారస్వామి జూడో కోచ్ లు వ్యాయామ ఉపాధ్యాయులు సీనియర్ క్రీడాకారులు హాజరైయ్యారు. ఈ పోటీలలో సుమారు 200 మంది జూడో క్రీడాకారులు పాల్గొనడం జరిగింది. పోటీలో పాల్గొన్న జూడో క్రీడాకారులకు కావటి కవిత రాజు యాదవ్ ఆర్గనైజర్ టీ షర్ట్స్ క్రీడా దుస్తులు తన సొంత డబ్బులతో పంపిణీ చేశారు. అదేవిధంగా గెలుపొందిన క్రీడాకారులకు జూడో దిగ్గజం కీ.శే కావటి రాజు యాదవ్ సతీమణి మాజీ కార్పొరేటర్ కవిత విజేతలకు మెడల్స్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పోటీలో పాల్గొన్న క్రీడాకారులు, సీనియర్ క్రీడాకారులు జూడో క్రీడా ప్రియుడైన కావటి రాజు యాదవ్ ను గుర్తు చేసుకుంటూ ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆయన క్రీడారంగంలో ఏ విధంగా జాతీయ స్థాయికి ఎదిగిన విధానాన్ని గుర్తు చేసుకున్నారు. రాబోయే రోజుల్లో కూడా రాజు స్మారకార్థం మరిన్ని పోటీలు నిర్వహిస్తానని వారు తెలిపారు.

## ప్రజావాణికి 94 దరఖాస్తులు

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను కలెక్టర్ ప్రజల నుండి స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 94 అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 63, జిల్లా గ్రామీణభివృద్ధి 8, మున్సిపాలిటీ 6, సర్వే ల్యాండ్ 6, జిల్లా పరిషత్ 2, ఈఈ ఆర్ అండ్ బి 2, విద్యా 2, ఏ డి మైన్స్, సంక్షేమ శాఖ, సోషల్ వెల్ఫేర్, ఎక్సైజ్, ప్రణాళికా శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కల్పనా, జడ్పీ సీఈవో శోభారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కారేపల్లిలో చోరీ

**ఐదు తులాల బంగారం అపహరణ**



కారేపల్లి, మహా: మండల కేంద్రమైన కారేపల్లిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కేతిమళ్ళ సారయ్య కుటుంబం ఇంటి బయట నిద్రిస్తున్నారు. ఇంటి వెనకాల తలుపు వేయటంలో అదమరవటంతో దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో బీరువాకే తాళం చెవి ఉండటంతో బీరువా తీసిన దుండగులు దుస్తులలో ఉన్న లాకర్ తాళం తీసి దానిలో ఉన్న ఉంగరాలు, చెవు కమ్మలు, చిన్న గొలుసులను సుమారు 5 తులాలను అపహరించారు. ఉదయం నిద్రలేచిన కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లగా బీరువా తెరిచి ఉండటం దానిలో వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండటంతో దొంగతనంగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఫ్యూచర్ సిటీలో కీలకంగా కడ్తాల మండలం భూములు

- **మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి**
- **రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్**
- **మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేత మండల పరిషత్ కార్యాలయం ప్రారంభించిన మంత్రి సీతక్క..**

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా: ఫ్యూచర్ సిటీలో కీలకంగా ఉన్న కడ్తాల మండలానికి అధిక నిధులు వెచ్చించాలని, మంత్రి సీతక్కకు వినతి పత్రం అందజేసిన రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్. రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండల కేంద్రంలో నూతన ఎంపీడీవో మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు సీతక్కకు, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, యువజన నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్ యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... నూతనంగా ఏర్పాటు చేయబడిన కడ్తాల్ మండలం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ పరిధిలో అత్యంత కీలకమైన మండలమని అన్నారు. భవిష్యత్తులో పారిశ్రామిక, వాణిజ్య, విద్యా మరియు ఉపాధి రంగాల్లో కడ్తాల్ మండలం ముఖ్యపాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కడ్తాల్ మండల సమగ్ర అభివృద్ధి కోసం అధిక మొత్తంలో ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించాలని, ముఖ్యంగా సిసిరోడ్, డ్రైనేజ్ మరియు మండల కేంద్రంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని, యువత కోసం మినీ స్టేడియం ప్లేగ్రౌండ్ అభివృద్ధి చేయాలని, విద్యార్థులు మరియు యువత కోసం ఆధునిక సౌకర్యాలతో కూడిన గ్రంథాలయ భవనం నిర్మించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అనుగుణంగా కడ్తాల్ మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సీతక్క వినతి పత్రాన్ని స్వీకరించి సానుకూలంగా స్పందించినట్లు క్యామ రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు మూడ రవి, పవన్ కళ్యాణ్, గిరి, మణికంఠ, దర్శన్, వాహెబ్, శ్రీను, రమేష్, శ్రీకాంత్, ప్రవీణ్, కుమార్ మరియు తదితరులు ఉన్నారు

# ఉత్తే.. రాళ్లు... ఎందుకు?



పోస్ట్... సర్ పోస్ట్... అమ్మా పోస్ట్... ఒకప్పుడు ఈ మాటలు చెవిన పడగానే ఇంట్లో ఏ పనిలో వున్నా దాన్ని వదిలేసి గుమ్మం వైపు పరుగులు తీసేవాళ్ళం. పోస్ట్ మెన్ ఇచ్చిన లెటర్ ఆద్యాంతం చదివివే వరకు మరో పని మీద ధ్యాస పెట్టే వాళ్ళం కాదు. ఇప్పుడు అంతా మారిపోయింది. సెల్ ఫోన్ చేతికి వచ్చింది. ఇంటర్ నెట్ ఇంటి తలుపు తట్టింది. అంతా ఇప్పుడు సెల్ ఫోన్ లో జరిగి పోతోంది. వాట్స్ యాప్ కబుర్లు, వీడియో కాల్స్, మెసేజ్ లన్నీ ఇప్పుడు సెల్ తోనే. ఆధునిక కాలంలో అర చేతిలో సెల్ లేకుండా క్షణం గడవడం లేదు. అలాగని ఉత్తరాల పర్వం ముగిసింది అనుకుంటే తప్పులో కాలు వేసినట్టే. అంతరించి పోతోంది అనుకున్న ఉత్తరాలకు రాజకీయ పార్టీలు ఇప్పుడు తిరిగి ప్రాణం పోస్తున్నాయి. బహిరంగ లేఖల తంతు ఇప్పుడు మళ్ళీ పాత ఉత్తరాల రోజులు గుర్తు చేస్తోంది. నిజమే మరి. పాత పద్ధతుల ను ఎవరో ఒకరు పాటిస్తేనే కదా, భవిష్యత్ తరాలకు వాటి గొప్పతనం తెలిసేది. ఈ విషయంలో రాజకీయ నేతలను మెచ్చుకుని తీరాల్సిందే. అసలు లేఖలు అంటే తెలీని నేటి తరానికి తిరిగి వాటిని పరిచయం చేస్తున్న రాజకీయ పార్టీల నేతలు ఇప్పుడు అందులోనూ రికార్డులు స్థాపించే దిశగా పరుగులు తీస్తున్నారు. ఎప్పుడో మూడు, నాలుగు దశాబ్దాల క్రితం వరకు ఓ వెలుగు వెలిగిన ఉత్తరాల వ్యవహారానికి నేతలు పూర్వ వైభవం తీసుకొని వస్తున్నారు. అసలు విషయం ఏమిటీ అంటే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో లేఖాస్త్రాలు సంచలనం రేపుతున్నాయి.

అధికారంలో వున్న రాజకీయ పార్టీపై విపక్షాలు విమర్శలు, ఆరోపణలు, సవాళ్లు చేయటం సర్వ సాధారణం. ఇందుకు మీడియాను రాజకీయ పార్టీ నేతలు వారధిగా వాడుకోవటం పరిపాటి. ప్రభుత్వం విధానాలు, పాలనలో లోపాలు, తప్పులు, ప్రజా సమస్యలు ఇలాంటి అనేక అంశాలపై పాలకులను ఎప్పటికిప్పుడు నిలదీయటం ప్రతిపక్ష పార్టీ నేతలకు తప్పనిసరి. అదే ఇప్పుడు లేఖలు సంధించుకునే వరకు వెళ్ళింది. హైదరాబాద్ నగరాన్ని విశ్వ నగరంగా చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆశ పడుతున్నారు. ఇదే ఫ్యూచర్ సిటీ ఆలోచనకు దారి తీసింది. హైదరాబాద్ అభివృద్ధి వేగం పెంచేందుకు మెట్రో రెండో దశ పనులను కూడా మొదలు పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడే అసలు చిక్కులు వచ్చి పడ్డాయి. మెట్రో నిర్మాణం కోసం అవసరమైన నిధులు సేకరించటానికి సీఎం కృషి చేస్తున్నారు. విదేశీ బ్యాంకుల నుంచి అప్పు తెచ్చే ప్రయత్నం ప్రారంభించిన సీఎం దాన్ని పూర్తి చేసేదాకా వెళ్లారు. తీరా నిధులు మంజూరు సమయంలో సమస్యలు వచ్చి పడ్డాయి. మెట్రో రెండో దశ నిర్మాణం పనులకు రావాల్సిన నిధులు ఆగి పోయాయి. దీంతో రగిలి పోయిన రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వల్లే లోన్ గడప వరకు వచ్చి ఆగిపోయిందని నిప్పులు చెరుగుతున్నారు. అయ్యా.. ఈ లోన్ తో నాకెలాంటి సంబంధం లేదు. నిబంధనలు మీరు సరిగా పూర్తి చేయలేదు. ఆ తప్పు నా మీద వేసి తప్పుకోవాలని చూస్తున్నారు అంటూ కిషన్ రెడ్డి ఎదురు దాడి మొదలు పెట్టారు. ఈ వివాదం ఇంతింతై వటుడింతై అన్నట్టు మారింది. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఈ లోన్ కోసం కొత్త ప్రయత్నం మొదలు పెట్టారు. అదే లేఖాస్త్రం. మెట్రో రెండో దశ నిర్మాణం కోసం మంజూరు అయిన 13 వేల మూడు వందల పై చిలుకు రుణ మంజూరీ కోసం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసేందుకు సీఎం రేవంత్ నిర్ణయించుకున్నారు. ఆ ప్రయత్నం చేశారు. కానీ అశ్విని వైష్ణవ్ అపాయింట్ మెంట్ సీఎంకు లభించటం లేదు. దీంతో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. కేంద్ర రైల్వే మంత్రి అపాయింట్ మెంట్ ఇప్పించాలని, వీలైతే కిషన్ రెడ్డి కూడా తమతో కేంద్ర రైల్వే మంత్రి వద్దకు వచ్చి మెట్రో రెండో దశ లోన్ మంజూరు అయ్యేలా సహాయం చేయాలని లేఖలో కోరారు. ఇప్పటి వరకు ఆ లోన్ మంజూరును కిషన్ రెడ్డి అడ్డుకున్నారని సీఎం రేవంత్ ప్రచారం చేసారని ఇప్పుడు ఆయన సహకారం కోరటం ఏమిటని మండి పడుతున్న తెలంగాణ బీజేపీ నేతలు సీఎం రేవంత్ పై కొత్త ఎదురు దాడి మొదలు పెట్టారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ ఇప్పించాలంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్రరావు సీఎం రేవంత్ కు బహిరంగ లేఖ రాశారు. రాహుల్ ను ఎందుకు కలవాలి అనుకుంటున్నారో కూడా ఆ లేఖలో తెలంగాణ బీజేపీ అధ్యక్షులు సవివరంగా చెప్పుకు రావటం మరో విశేషం.

గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ చాలా హామీలు ఇచ్చింది. వాగ్దానాలు చేసింది. గ్యారంటీ కార్డులు పంచింది. ప్రజలను నమ్మించింది. ఓట్లు రాల్చుకుంది. సీట్లు గెల్చుకుంది. అధికారం హస్తగతం చేసుకుంది. తెలంగాణలో రెండున్నర ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఆ పార్టీ ఇచ్చిన హామీలు, వాగ్దానాలు ఏవి నెర వేర్చ లేదు. ప్రజలను నమ్మించి, నయవంచన చేశారు. ఈ అంశాలపై రాహుల్ తో మాట్లాడాలి. దయచేసి ఆయనను కలిసే ఏర్పాటు చేయండి. మాతో పాటు మీరూ రావచ్చు అంటూ తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచంద్రరావు సీఎం రేవంత్ కు లేఖ రాశారు. అంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రాసిన లేఖకు తెలంగాణ బీజేపీ అధ్యక్షులు ఇలా మరో బహిరంగ లేఖ ద్వారా కౌంటర్ ఇచ్చారు. ఇదే ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయింది. ముల్లును ముల్లుతోనే తీయాలి.. లేఖకు లేఖతోనే జవాబు ఇవ్వాలి అన్న పాలసీ ఇక్కడ స్పష్టంగా కనిపించడం విశేషం. సీఎం రేవంత్ లేఖకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించి సెంట్రల్ రైల్వే మంత్రి అపాయింట్ మెంట్ ఇప్పిస్తారా? ఇది జవాబు లేని ప్రశ్న... ఇక తెలంగాణ బీజేపీ అధ్యక్షులు కోరిన విధంగా రాహుల్ ని కలిసే ఏర్పాట్లు సీఎం రేవంత్ చేస్తారా అంటే అది అసంభవం. సాధ్యం కానివి, అమలుకు వీలు లేనివి డిమాండ్లగా పెట్టి ఇప్పుడు రాజకీయాలు సాగించటం వెనుక ఆంతర్యం ఏమిటీ అనేదే జనానికి అర్థం కావట్లేదు. అత్యంత కీలక అంశాలపైన లేఖలు సంధించుకోవటం ఓ విడ్డూరం అయితే, సిద్ధాంతపరంగా బద్ధవిరుద్ధంగా వుండే పార్టీ నేతలు లేఖల ద్వారా సహాయం, సహకారం కోరుకోవటం మరో విచిత్రం. లేఖల మాట ఎలా వున్నా మెట్రో రెండో దశ లోన్ ఎందుకు ఆగింది. దానికి కారణాలు ఏమిటీ? ఏం చేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుంది? అనే కోణంలో ఇప్పుడు ప్రయత్నం జరగాలి. అంతేకానీ ఆచరణ సాధ్యం కానీ లేఖలు ఎన్ని సంధించుకున్నా ఫలితం శూన్యమే అవుతుంది. ఈ విషయం పాలకులకు తెలుసు. పాలకులు చేసే ప్రయత్నం విషయంలో విపక్షాలు సహాయం, సహకారం అందించక పోయినా పర్వాలేదు. అడ్డు పడకుండా ఉంటే చాలు. అభివృద్ధి అనేది ప్రజలకు మేలు చేసే అంశం. ఇందులో రాజకీయ ప్రయోజనం ఆశించటం సరికాదు. ఇదే ఇప్పుడు అధికార పక్షం, విపక్షాలు గమనించాలి. అభివృద్ధి క్రెడిట్ విషయంలో పోటీ పడితే అది ప్రజలకు సమస్యగా మారుతుంది. తెలంగాణకు హైదరాబాద్ గుండెకాయ. ఇక్కడ అభివృద్ధి జరిగితే తెలంగాణ వికాసం రాష్ట్రం మొత్తానికి అందుతుంది. ఇప్పుడు నేతలు దీన్ని ఖచ్చితంగా గుర్తు పెట్టుకోవాలి. మెట్రో రైలు ఒక్కటే కాదు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన అన్ని ప్రయోజనాలు రప్పించుకునే దిశగా అన్నీ పార్టీ నేతలు చొరవ చూపాలి. అప్పుడే తెలంగాణ మరింత ప్రగతి సాధించి విశ్వ విఖ్యాతి నగరంగా ప్రపంచ పటంలోకి ఎక్కుతుంది.



**జి. వెంకటరమణ.**
**సీనియర్ జర్నలిస్ట్.**

## హ్యాట్సాఫ్ రేవంత్ జీ

# యాభై ఏళ్ల క్రితం కథ.. నేటికి నేరవేరిన ఓ కల..!

ముందుగా ఓ కథ చెప్పుకుందాం..కథ చివరలో ముగింపు ఏమిటో, అదెంత విలువైందో మీకే అర్థమవుతుంది...

సరే, ఇక కథలోకి వెళ్దాం పదండి...చాలా ఏళ్ల క్రితం... దాదాపు యాభై ఏళ్ల క్రితం...పాలమూరు జిల్లాలోని ఓ పల్లె... స్కూళ్లు తెరిచే రోజు...ఆ పిల్లాడు సంతోషంగా ఉన్నాడు...బడికెళ్లే హుషారు లో ఇల్లంతా సందడిగా తిరుగుతున్నాడు...దగ్గరలోనే బడి, వెళ్లి, క్లాసులైపోగానే, దోస్తులతో ఆటలు... అందుకే ఆనందం .అంతేకాదు, అన్నీ కొత్తవి వస్తాయి, కొత్త యూనిఫాం, కొత్త బ్యాగు, కొత్త పుస్తకాల సెట్, కొత్త కంపాస్ బాక్స్...కానీ నాన్న అన్నాడు, కొత్త పుస్తకాలు ఎందుకురా, అన్న చదువుకున్న పాత పుస్తకాలున్నాయి కదా, వాటికే కొత్త అట్టలు వేసుకో...

వద్దు నాన్నా, నాకన్నీ కొత్తవే కావాలి...పిల్లాడి మారాం...సరేలే, సరేలేరా, కొనిస్తాను అన్నాడు నాన్న...వచ్చేశాయి, వాటితోపాటు కొత్త వాటర్ బాటిల్, కొత్త టిఫిన్ బాక్స్, కొత్త ఫుట్ బాల్ (అప్పటి నుంచే తనకు ఫుట్ బాల్ ఆటంటే ప్రేమ)...అన్నీ అపురూపంగా తడిమి చూసుకున్నాడు...

స్కూల్ రీ ఓపెనింగ్...దోస్తుల తో ఫుట్ బాల్ ఆడేయాలి...అదీ ఆత్రుత, ఆనందం, హడావుడి... మనసు పరుగులు పెడుతోంది...తన బెస్ట్ ఫ్రెండ్ రాజు, దిగాలుగా కనిపించాడు...ఏమైందిరా, అలా ఉన్నావు...రాజు మొహంలో కళ లేదు...కారణం..? రాజుకు సరైన బ్యాగ్ లేదు, బాక్స్ లేదు, ఎవరినో అడుక్కుని తెచ్చుకున్న పాతబడిన, అక్కడక్కడా చిరిగిపోయిన పుస్తకాలు...రాజు నాన్నను అడిగినా తను కొనివ్వలేదు, కొనివ్వలేడు, ఈ తరగతికి ఇక ఇంతే...ఆ పాత ఏడుపే...

ఈ పిల్లాడికీ బాధనిపించింది...ఇద్దరమూ ఒకే ఏజ్, ఒకే క్లాస్...నాకు కొత్తవి, వాడికి పాతవి...నో, నో...మా నాన్నను అడుగుతా...ఆ రాత్రి భోజనం చేస్తున్నప్పుడు నాన్నను అడిగాడు...

నాన్నా, నాకు ఏమేం కొనిచ్చావో, అన్నీ రాజుకు కూడా కొనివ్వు నాన్నా ప్లీజ్...వాడికీ కొత్త బట్టలు, కొత్త బ్యాగ్, కొత్త పుస్తకాలు...

ఎవరికో మనమెందుకు కొనివ్వాలిరా, ఎందరికి కొనిస్తాం, నీకేమైనా పిచ్చి పట్టిందా..? కుదరదు..

ప్లీజ్ నాన్నా, రాజుకు కూడా ఇవి కొనివ్వక పోతే నేను బడికే పోను...మళ్లీ అదే మంకు, అదే మారం.. తనకు తెలుసు, కొడుకు పంతం, వదలడు...సర్లేరా, రాజుకు కొనిస్తాలే అన్నాడు...ఈ కుర్రాడి కళ్లలో వెలుగు తో కూడిన ఆనందం ...

అనుకున్నట్టుగానే మూడు రోజుల్లో కొత్త సెట్, కొత్త బట్టలు, కొత్త బ్యాగ్ అన్నీ వచ్చాయి...రాజును పిలిచి ఇచ్చాడు ఆ తండ్రి, బాగా చదువుకొండి అన్నాడు ఆశీర్వదిస్తూ...అలాగే కొడుకుతో ఓ మాటన్నాడు...

ఒరేయ్, నీ దోస్త్ రాజు ఒక్కడే కాదు, లక్షల మంది రాజులున్నారు. తెలంగాణలో...అందరూ పేదలే, అందరికీ కొత్త బ్యాగులు కావాలి, స్కూల్ తెరిచేనాటికి కొత్త పుస్తకాల సెట్ కావాలి, కొత్త యూనిఫామ్ కావాలి, మరెవరు కొనివ్వాలిరా..? వాళ్లు ఉదయం, మధ్యాహ్నం ఏమీ తినకుండానే బడికి వచ్చిపోతున్నారు, వాళ్లకు టిఫిన్లు, భోజనం మాటేమిటిరా..?

ఆ పిల్లాడు అన్నాడు...“నాన్నా, ఇది యాదికి ఉంచుకుంటాను, ఏదో ఒకరోజు వస్తుంది...ఆరోజు బడి తెరిచే టైమ్ కు...కొత్త బ్యాగులు, కొత్త యూనిఫారాలు, కొత్త బాక్సులు అన్నీ ఇస్తాను...అంతేకాదు, ఏ ఆట ఆడాలన్నా సరే, అన్నీ ఇస్తాను...పొద్దున టిఫిన్ పెడతాను, మధ్యాహ్నం భోజనం కూడా పెడతాను” మాటవరుసకు అనలేదు, అది మైండ్ లో ఫిక్సయి పోయిన ఓ సంకల్పం...

**యాభై ఏళ్ల తరువాత**

తెలంగాణ పబ్లిక్ స్కూల్...పిల్లలందరి లోనూ ఆనందం...ఆ పిల్లాడు ఆరోజు అనుకున్నది చేసి చూపించాడు...స్కూల్ బస్సు, బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, స్వాగత కిట్లు, పుస్తకాలు, యూనిఫారాలు, వాట్ నాట్..? అవును, అప్పుడెప్పుడో ఆ పిల్లాడి మైండ్‌లో ఫిక్సయిపోయిన ఓ ఆలోచన ఇప్పుడు ఆచరణలోకి వచ్చింది నిజంగానే..! నిజంగానే..!!

ఇప్పుడు ఆ పిల్లాడు ఎవరో అర్థమైంది కదా...

**హ్యాట్సాఫ్ రేవంత్..జీ ...!!**

**- ఈ.శ్రీనాథ్,**
**వరంగల్ బ్యూరో, మహాపత్రిక**



# 1/70 చట్టం ఏం చెప్తుంది..?



తెలుగు రాష్ట్రాలు అయినా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ గా విడిపోయిన ఆదివాసి ప్రజల చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు అక్కడ, ఇక్కడ ఒకే విధంగా చూడాలి. దేశానికి స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు గడుస్తున్నా 1950 నుండి ఆదివాసులకు హక్కులు అమల వుతున్న నేటికీ అగ్గిరాజేస్తున్న అనేక ఆదివాసీ భూమి పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. జల్, జంగల్, జమీన్ నినాదం ఆదివాసీ ప్రాంతాలలో అగ్నిజ్వాలరగులుతూనే ఉంది. ప్రభుత్వ పాలనకు ముందు బ్రిటీష్, నిజాం నవాబులు, అంతకుముందు కాకతీయులు అలాగే మౌర్య చక్రవర్తుల పాలనలో సైతం ఆదివాసీల మనుగడే ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో వారి నుండి తిరుగుబాటు పోరాటాలు జరిగాయనడానికి చారిత్రక సాక్ష్యాలు లేకపోలేదు స్వయం పాలన కోసం కాకతీయులతో పోరాడి అసువులు బాసిన సమ్మక్క సారలమ్మ నుండి నిజాం సేనలతో పోరు చేసిన రాంజీ గోండ్, కొమరం భీం వరకు అలాగే మహారాష్ట్ర, చందా, బస్తర్, జార్ఖండ్ వంటి ప్రాంతాల్లో సిద్కాకి బాబురావు, వీర్ నారాయణ సింగ్, బిర్సా ముండా, మాణిక్ ఫర్ద్, బల్లార్షా వంటి యుగపురుషుల తిరుగుబాటు తమ మనుగడ కోసం భారతదేశ స్వాతంత్రం కోసం చివరి శ్వాస వరకు పోరాడి ఉరి తీయబడటం కాల్చివేతకు గురికావడం అంటే అతిశయోక్తి కాదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో భద్రాచలం నుండి రంపచోడవరం ఏలూరు దాకా జరిగిన పోరాటాన్ని అణచివేసేందుకు బ్రిటీష్ ప్రభుత్వానికి రెండు సంవత్సరాలకు పైగా సమయం పట్టింది. ఆదిలాబాద్ జిల్లాలో కొమరం భీం పోరాటాన్ని అణచివేసేందుకు నిజాం రాజు, మైసూర్ మహారాజు సైనిక దళాల సహాయం తీసుకోవడం జరిగింది అంటే ఆదివాసి పోరాటాలపై ఆనాటి సామంత రాజుల యొక్క నియంత్రణ, అణచివేతలు ఆనాటి నుంచి ఆదివాసులపై కొనసాగుతూనే ఉన్నాయి.

భూమి, నీరు, అటవీ మాదే అంటూ జరిగిన అనేక ఆదివాసీల పోరాటాలపై అధ్యయనం చేసిన నాటి ప్రభుత్వాలు, బ్రిటీష్ ప్రభుత్వాలు అలాగే నేటి ప్రభుత్వాలు ఆదివాసుల కోసం ప్రత్యేక చట్టాలను తెచ్చాయి. 1917లో బ్రిటీష్‌వాళ్ళు అప్పటి మద్రాసు రాష్ట్రంలోని ప్రస్తుత ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాలలో భూమి బదలాయింపు, వడ్డీ వ్యాపారాన్ని నియంత్రించేందుకు 1917 చట్టం చేసారు. ఏజెన్సీ ప్రాంతాలలో కలెక్టర్ (ఏజెంట్) అనుమతి లేకుండా గిరిజనుల నుండి గిరిజనేతరులకు భూమి బదలాయింపు జరగడానికి వీలులేదన్నది ఈ చట్టం సారాంశం. 1956లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1917 చట్టాన్ని సవరించి 1959 (ఏ.పి. ఎస్.ఎ.ఎల్.టి.ఆర్. చట్టం) ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టాన్ని చేశారు. ఇందులో గిరిజనుల నుండి గిరిజనే తరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ భూమి బదలాయింపు జరగడానికి వీల్లేదని, జిల్లా కలెక్టర్ అనుమతి సైతం లేదన్నది స్పష్టం. 1963 నుండి ఈ చట్టాన్ని తెలంగాణ జిల్లాలలోని షెడ్యూల్డు ప్రాంతాలకు వర్తింపజే శారు. దీనితో ఆదివాసిల భూములు ఆక్రమణలు అన్యాక్రాంతంకు గురికాకుండా రక్షించబడ్డాయి. షెడ్యూల్డ్ ఏరియాలో వలస గిరిజనేతరులు బినామీల పేర్లతో ఆదివాసుల భూములను చట్ట విరుద్ధంగా విక్రయిస్తూ... ఆదివాసుల హక్కులకే భంగం కలిగిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనేతరులు సృష్టిస్తున్న ఆకృత్యాలపై ప్రభుత్వం, పాలకులు, ఆదివాసి ప్రజాప్రతినిధులు పట్టించుకునే నాధుడే కరువైయుండని ఆదివాసీ ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1/70 చట్టం నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరుడు మరొక గిరిజనేతరుని వద్ద భూమి కొనుగోలు చేస్తే ఆ భూమిపై కొనుగోలుదారుడు మరియు అమ్మకందారుడు ఇద్దరూ ఆ భూమి పై హక్కులు కోల్పోతారని 1993లో రాష్ట్ర హైకోర్ట్ తీర్పు ఇచ్చింది.

నాడు చోటుచేసుకున్న వాస్తవ పరిస్థితులు అంటే 1960 దశకంలో నక్సల్స్ నేతృత్వంలో జరిగిన పీడిత ప్రజల శ్రీకాకుళ గిరిజన తిరుగుబాటు వంటి పోరాటాల దాకా రాష్ట్రంలో గిరిజనుల యోగక్షేమాలు కనుక్కున్న వాళ్లు అతితక్కువలో తక్కువే. ఆ తర్వాత మాత్రం ఆదివాసుల మంచి చెడుల గురించి చర్చించడం, కొత్త చట్టాలు, కొత్త సంస్థలు వచ్చాయి. అందులో ఒకటి రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970, ఇది 1959 నాటి చట్టాన్ని సవరించి రెండు బలమైన మార్పులను ప్రవేశపెట్టింది.

1). ఇక మీదట షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనుల నుండి గిరిజనేతరులకు జరిగే భూ బదలాయింపులే కాదు, గిరిజనేతరుల నుండి గిరిజనేతరులకు జరిగే భూ బదలాయింపులు కూడా చెల్లవు.

2). షెడ్యూల్డ్ ప్రాంతాలలో భూమి కలిగి ఉన్న గిరిజనేతరులు ఆ భూమిని తాము అక్రమంగా సంపాదించుకోలేదని తామే రుజువు చేసుకోవాలి. అంతవరకు అది గిరిజనుల భూమిగా భావించబడుతుంది. అంటే రుజువు చేసుకునే బాధ్యత (బర్డెన్ ఆఫ్ ప్రూఫ్) గిరిజనేతరుల మీదనే ఉన్నదనేది తేటతెల్లం. దీని ఫలితంగా గిరిజనుల నుండి ఫిర్యాదు లేకుండానే సంబంధిత ప్రభుత్వ అధికారి షెడ్యూల్డ్ ప్రాంతాలలో భూమి ఉన్న గిరిజనేతరులందరికీ నోటీస్ జారీ చేయవచ్చును. నీ భూమి అక్రమంగా సంపాదించుకున్నది కాదని నిరూపించుకోమ్మని అడగవచ్చును. సమాధానం సంతృప్తికరంగా లేకపోతే ఆ భూమిని స్వాధీనం చేసుకొని భూమి లేని గిరిజనులకు ఇవ్వవచ్చునన్నది స్పష్టం. 1/70 చట్టం నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరుడు మరొక గిరిజనేతరుని వద్ద భూమి కొనుగోలు చేస్తే ఆ భూమిపై కొనుగోలుదారుడు మరియు అమ్మకందారుడు ఇద్దరూ ఆ భూమి పై హక్కులు కోల్పోతారని 1993లో రాష్ట్ర హైకోర్ట్ తీర్పు ఇచ్చింది.

షెడ్యూల్డ్ ప్రాంతంలో గల ప్రభుత్వ భూమిని గిరిజనేతరులకు బదలాయించడం చెల్లదని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా 1/70 భూ నిబంధనల కింద గిరిజనేతరునిగానే భావించాలని 1997లో సమతా మరియు మైనింగ్ కంపెనీకి మధ్య నడిచిన కేసులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గిరిజనులు సాగు చేసుకుంటున్న అటవీ భూమి నుండి వారిని తొలగించడం లేదా వారి అటవీ భూమి హక్కుల్లో జోక్యం చేసుకోవడం, గిరిజనులకు మాయ మాటలు చెప్పి వారి జీవనోపాధి అయిన వ్యవసాయం చేసుకునే భూమిని సొంతం చేసుకోవడం కూడా అత్యాచారమే అని కొత్తగా రూపొందించిన సవరణ చట్టం 2015 తెలియజేస్తుంది. ఆదివాసుల కోసం ఎంతో బలమైన చట్టాలు ఉన్నప్పటికీ ఏజెన్సీ ప్రాంత ఆదివాసులకు తీవ్రమైన అన్యాయం జరుగుతూనే ఉంది. ఎందరో ఆదివాసి పోరాట యోధులు, బుద్ధి జీవులు నేతృత్వంలో 1960 దశకంలో నాడు ఏ అమాయకపు ఆదివాసీల కోసమైతే పోరాటాలు జరిగాయో ఆదివాసీల ప్రజల రక్షణ కోసం ఎల్ టి ఆర్ చట్టం, 1/70 యాక్ట్, పేసా గ్రామ సభ, వడ్డీ వ్యాపారాలని నిషేధిత చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి అనేక చట్టాలను ప్రభుత్వాలు తీసుకువచ్చాయి. అక్రమంగా వలస వచ్చిన గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతాలలో అంగ బలం, ఆర్థిక బలం, రాజకీయ బలం పెంచుకొని ఆదివాసుల హక్కులను, చట్టాలను లెక్కచేయకుండా ఆదివాసుల భూములను బినామీ పేర్లతో ఆక్రమించుకొని వారే నిజమైన హక్కుదారులుగా రాజ్యమేలుతున్నారు. ఆదివాసీ ప్రాంతాలలో హక్కులు అడ్డొస్తున్నాయన్న పేరుతో గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతా భూములు, ఉద్యోగ అవకాశాలను దెబ్బ తీసేందుకు 1998 లో జీవో నెంబర్ 275 ను వలస గిరిజనేతరులు ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ కోర్టులో కేసు వేసి రద్దు చేయించారు. సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ సిఫారసులు మేరకు 275 జీవో స్థానంలో జీవో నెంబర్ 3 ను జనవరి 2000 సంవత్సరం నా జారీ చేయడం జరిగినది. వలస వాదుల కుట్రలు, కుయుక్తులతో జీవో 3ను సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే కోర్టు 22 ఏప్రిల్ 2020 రద్దు చేయడంతో తెలుగు రాష్ట్రాలలోని చదువుకున్న ఆదివాసి యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారు. దానిని కొనసాగింపుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏజెన్సీ గ్రామాలు కాదు అంటూ మైదాన ప్రాంతానికి సమీపంలో ఉన్న సుమారు ఆరు గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిలిపివేయాలని కోర్టును ఆశ్రయించారు. ఇంతటితో ఆగకుండా షెడ్యూల్ ఏరియా హక్కులతో భంగం వాటిల్లుతుందని గిరిజనేతరులకు మూకుమ్మడిగా సుప్రీంకోర్టుని ఆశ్రయించి 1/70 చట్టం సవరించి భూములపై మాకు హక్కులు కల్పించాలని 1684 మంది గిరిజనేతరులు పిటిషన్ దాఖలు చేశారు. ములుగు జిల్లా ఏటూరు నగరంలో 140 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు గిరిజనేతరులు ప్రయత్నించగా స్థానిక ఆదివాసులు తిరగబడడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. 144 సెక్షన్ విధించి పోలీసులు అక్కడ పరిస్థితులను చక్కబెట్టారు. ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతాలలో సుమారు 20వేల ఎకరాల పట్టా భూములు గిరిజనేతరుల చేతిలో పరాయికరణకు గురైనట్లు అధికారికంగానే లెక్కలు ఉన్నాయి. ఇక పోడు భూముల విషయానికి వస్తే పట్టా భూములు వలసవాదులు ఆక్రమించుకున్నారని జీవన ఉపాధి కోసం పోడుభూమి సాగు చేసుకుంటుంటే ఫారెస్ట్ అధికారుల ఆగడాలతో ఆదివాసీ ప్రజల జీవనం అందాకారమవుతుంది. ఏజెన్సీ ప్రాంతాలలో వివిధ రాజకీయ పార్టీల నాయకులుగా చలామణి అవుతున్న గిరిజనేతరుల చేతుల్లోనే వందల ఎకరాల పోడు భూములను ఆక్రమించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల మంది ఆదివాసులు పోడు సాగు భూములకు హక్కు పత్రాలు కావాలని దరఖాస్తు చేస్తే తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కేవలం 12 వేల మందికి మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. తెలంగాణలో పోడు సాగు పోరు రగడ రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. నేడు ఆదివాసుల దుస్థితి ఊర్లో ఉన్నయ్యారు... అడివిలో బతకనీయరు అన్న చందంగా మారింది. ఆదివాసుల అభివృద్ధి కోసం ఎన్ని చట్టాలు ఉన్నా అవి అమలకు నోచుకోనంత కాలం ఆదివాసీ ప్రజలు అన్యాయాలకు, అక్రమాలకు, వలస గిరిజనేతరుల కుట్రలకు బలవుతూనే ఉంటారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు రాజ్యాంగబద్ధ పదవిలో కొనసాగుతున్న దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్ 5వ షెడ్యూల్ భూభాగం ఏజెన్సీ ప్రాంత పరిధిలోని విధులు నిర్వహిస్తున్న అధికారులు ఆదివాసీ ప్రజల భూ సమస్యలను జాతి సమస్యగా కాకుండా జాతీయ సమస్యగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకుంటే తప్ప ఆదివాసి ప్రజల అస్తిత్వానికే ప్రమాదం పొంచి ఉంది.



**-డాక్టర్ సాగబోయిన పాపారావు**
**ఆదివాసీ విద్యార్థి సంఘం**
**వర్కింగ్ ప్రెసిడెంట్**
**సెల్ నంబర్ :9441288991**



# స్మార్ట్ టెంపుల్‌గా సోమేశ్వరాలయం

- 5 కోట్ల రూపాయలు మంజూరు
- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**యాదాద్రి భువనగిరి జూన్ 22 మహా** : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాకలో గల ప్రసిద్ధ శ్రీ సోమేశ్వర ఆలయాన్ని ఒక స్మార్ట్ టెంపుల్ గా రూపొందిస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కృష్ణారావు అన్నారు సోమవారం నాడు సోమేశ్వర ఆలయాన్ని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యతో కలిసి సందర్శించారు... ముందుగా శ్రీ సోమేశ్వరాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ఈ ఆలయం గొప్ప ఆలయం అని ప్రతి శివరాత్రికి లక్ష మంది భక్తులు వివిధ ప్రాంతాలనుంచి వస్తారని అలాగే ప్రతి సోమవారం పదివేల మంది భక్తులు సందర్శించుకుంటారని అన్నారు... ఈ ఆలయం పురాతన వైభవం ఉట్టి పడే విధంగా అభివృద్ధి చేస్తామని అందుకుగాను ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు... ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఈ గ్రామం ఎంతో చరిత్రమైనదని 18కి కులాలకు 18 మఠలతో పాటు ప్రసిద్ధిగాంచిన సోమేశ్వరాలయం, జైన్ దేవాలయం, స్వామి ఆలయం లో ఉన్నాయని గత ప్రభుత్వం పాలనలోఈ ఆలయం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు చారిత్రాత్మకమైన ఈ ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రిని బీర్ల ఐలయ్య కోరారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభరాణి, జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు, ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ అధికారి అర్జున్ రావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జనగాం ఉపేందర్ రెడ్డి, ఆలేరు ఎమ్మార్వో ఆంజనేయులు,ఎంపీ డి ఓ సత్యాంజనేయ ప్రసాద్, కొలనుపక్క సర్పంచ్ యాకమ్మ, మాజీ ఎంపీపీ గంధ మల్ల అశోక్, మాజీ సర్పంచ్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంటాక్ట్ విధానం రద్దు చేయాలి కార్మికులను పర్మినెంట్ చేయాలి

- కలెక్టరేట్ ముందు మున్సిపల్ కార్మికుల ధర్నా



**యాదాద్రి భువనగిరి జూన్ 22 మహా** రాష్ట్ర ప్రభుత్వం కాంటాక్ట్ విధానం రద్దు చేసి మున్సిపల్ కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి పాండు అన్నారు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కాంటాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా దాసరి పాండు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యంగా ఉన్నదని ఏళ్ల తరబడిగా మున్సిపల్ కాంటాక్ట్ కార్మికులుగా మున్సిపల్ పట్టణాలను శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని కాంట్రాక్టు విధానం రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చేముందు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం చేసి కనీస వేతనాలు కార్మిక చట్టాలు సౌకర్యాలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయలేదని మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారు అట్టడుగు కులాలకు సంబంధించిన కులాలకు సంబంధించిన ఎస్సీ ఎస్టీ మైనార్టీ బీసీ మైనార్టీ కులాలకు సంబంధించిన వారు పనిచేస్తున్నారని ప్రతిరోజు లేవగానే గ్రామ ప్రజలు భక్తి పేరుతో దేవాలయాలు వెళ్లి ప్రార్థనలు చేస్తున్నారు కానీ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు లేవగానే గ్రామ కోడళ్ళ వద్ద ప్రజలు తమ ఆరోగ్యాల కోసం మూఢనమ్మకాలతో నిమ్మకాయలు మిరపకాయలు వేసి తిప్పేసిన వాటిని కూడా శుభ్రం చేస్తూ ప్రజలను కాపాడుతున్నారని ఇలాంటి కార్మికుల పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి చిత్తశుద్ధి లేదని వెంటనే అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచాలని రెగ్యులర్ గా వేతనాలు ఇవ్వాలని బెనిఫిట్స్ ఇవ్వాలని ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడానికి రుణ సౌకర్యం కల్పించాలని యూనిఫాం పనిముట్లు అధికారుల వేధింపులు ఆపాలని కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన లేనియెడల కార్మికులను సమీకరించిన ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు మాయ కృష్ణ,మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రామచందర్,ఎల్లయ్య, రవి, కొండయ్య, బిక్షపతి,లక్ష్మమ్మ, లింగమ్మ,శోభ,రోజా, శ్యామల, యాదమ్మ వరమ్మ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్



**మంచిర్యాల, మహా**: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మంచిర్యాల డీసీపీ ఎ భాస్కర్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వశాంతి కేరళ పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులు రూపొందించిన చిత్రాలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం,పోలీస్ శాఖ విస్తృత చర్యలు చేపడుతున్నాయని తెలిపారు. డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ అరెస్టులు చేస్తున్నప్పటికీ, కొంతమంది యువత తెలిసో తెలియకో వాటి బారిన పడుతున్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసిక సమతుల్యత దెబ్బతిని,కుటుంబ సభ్యులతో పాటు సమాజానికీ ఇబ్బందులు కలుగుతాయని చెప్పారు. సాధారణంగా చిన్న ఆసక్తితో సిగరెట్, ఇతర మత్తు పదార్థాలను ప్రయత్నించడం ప్రారంభమై, క్రమంగా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందని వెల్లడించారు. ఈ వ్యసనాల కారణంగా కొందరు దొంగతనాలు వంటి నేరాలకు కూడా పాల్పడే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. అందువల్ల విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు జీవితానికి అవసరమైన విలువలను కూడా బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా తమకు నచ్చని లేదా హానికరమైన విషయాలకు ధైర్యంగా నో చెప్పడం నేర్చుకోవాలని సూచించారు. చిన్నప్పటి నుంచే నో చెప్పే అలవాటు పెంపొందితే భవిష్యత్తులో సరైన నిర్ణయాలు తీసుకునే వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు. విద్యార్థులు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలను గమనించినట్లయితే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, అవసరమైతే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. మంచి పౌరులుగా, బాధ్యతాయుతమైన విద్యార్థులుగా ఎదిగి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజాన్ని కూడా అప్రమత్తం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్, శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్ఐ సంతోష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టుదలతో జర్మనీ భాషను నేర్చుకుని ఉపాధి పొందాలి

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మందమర్రి, మహా**: పట్టుదలతో జర్మనీ భాషను నేర్చుకుని ఉపాధి పొందాలని తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. సోమవారం మందమర్రిలో జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ యువత లక్ష్యాలను ఉంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. టామ్ కామ్ సంస్థ ద్వారా విదేశాలలో ఉపాధి అవకాశాలను కల్పించడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో అభ్యర్థులు జర్మన్ భాషను ఇష్టంగా నేర్చుకోవాలని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారు తమ తల్లిదండ్రులను సంతోషంగా చూసుకోవాలని, ఇతరులకు ఆదర్శంగా నిలిచి మరింత మందికి అవకాశాలు కల్పించేలా కృషి చేయాలని తెలిపారు. విదేశాలలో స్థానిక నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, పనిలో బాస్ మేనేజ్మెంట్ 70 శాతం ఉంటే పని 30 శాతం ఉంటుందని, అభ్యర్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, జర్మనీలో నైపుణ్యం కలిగిన యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. జర్మనీలో వారానికి కేవలం 32 నుండి 35 గంటల పని సమయం మాత్రమే ఉంటుందని, మిగతా సమయంలో ఇతర నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యువతలో క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనపై దృష్టి ఉండాలని, జర్మన్ భాషను నేర్చుకోవడానికి ప్రతిరోజూ సాధన చేయాలని సూచించారు. జర్మనీలో ఉద్యోగం సాధించాలనే స్పష్టమైన లక్ష్యంతో శిక్షణ పొందితే విజయం సాధిస్తారని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మందమర్రి సింగరేణి శిక్షణ కేంద్రంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణను ఏకాగ్రతతో నేర్చుకోవాలని ఆయన వెల్లడించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. భాష శిక్షణను నిదానంగా, స్పష్టంగా నేర్చుకోవాలని శిక్షణ కాలం పూర్తి అయ్యేసరికి భాషపై పట్టు సాధించాలని, నైపుణ్యం సంపాదించాలని తెలిపారు. విదేశాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, శిక్షకులు, యువత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హెచ్‌బీ కాలనీలో సీసీ రోడ్ల సమస్యల పరిష్కారానికి వినతిపత్రం

**కుషాయిగూడ, మహా** : హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని పలు సీసీ రోడ్ల సమస్యల పరిష్కారం కోసం మాజీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్ సోమవారం ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తాను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కూడా పాల్గొన్నారు. మంగాపురం కాలనీ, ఇంద్రనగర్ ఫేజ్ 1 కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించి త్వరితగతిన ఆమోదం తెలపాలని వినతి పత్రంలో కోరారు. రోడ్ల సమస్యల కారణంగా స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పనులు చేపడితే ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి తగిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు ప్రభుదాస్ తెలిపారు. సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తే స్థానిక ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తారని పేర్కొన్నారు.





# కుషాయిగూడలో రూ.76 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

**కుషాయిగూడ, మహా** : చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ గ్రామంలో రూ.76 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించడంతో పాటు కాలనీల అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కుషాయిగూడ ప్రాంతంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, తాజా సీసీ రోడ్డు నిర్మాణంతో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రోడ్డు పనులు పూర్తయితే వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గి స్థానికుల రాకపోకలు సులభతరం కానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోమశేఖర్ రెడ్డి, పార్టీ నాయకులు మహేష్ గౌడ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలి

**మేడ్చల్ డిఈఓకు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్**

**కుషాయిగూడ, మహా** : జిల్లాలోని పలు ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతున్నాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్వీ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)కి ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీఆర్ఎస్వీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్వీ చేపట్టిన ఈ ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటించారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని, ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని సూచించారు.విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాల పరిరక్షణ కోసం బీఆర్ఎస్వీ చేపడుతున్న పోరాటాలకు తమ మద్దతు కొనసాగుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్వీ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్

**ఇబ్రహీంపట్నం జూన్ 22 మహా:**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో ఎన్ఎస్ఎస్ విభాగము ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను చెత్తాచెదారాన్ని తొలగించి, చెట్లకు నీరు పోసారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్ రాధిక మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు మనం ఉండే ఇల్లు, పని చేసే ప్రదేశాలు అదే విధంగా మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్ర పరిసరాల వలన దోమలు ఈగలతో అనేక రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి స్వచ్ఛత పట్ల ప్రతి విద్యార్థి తమ పరిసర ప్రజలకు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఇటీవల కాలంలో యు.ఎన్.ఈ.పి (ఐక్యరాజ్యసమితి పర్యావరణ పథకం) విడుదల చేసిన స్వచ్ఛత నివేదికలో 180 దేశాలకు గాను మన దేశం యొక్క ర్యాంక్ 176 స్థానంలో ఉందని గుర్తుచేశారు. ఇది చాలా దారుణమైన విషయం అని అన్నారు. అపరిశుభ్ర పరిసరాల వలన మన దేశం యొక్క పర్యాటక వ్యవస్థ కూడా ప్రభావితం అవుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే. సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్. రమేష్ డాక్టర్ చింతల రాకేష్ భవాని, డాక్టర్ రచన, అధ్యాపకులు టి. శ్రీకృష్ణ, డాక్టర్ ఈ. నర్సింగ్ రావు, జి. రవి కుమార్, హృదయ రాజ్, నరేందర్ రెడ్డి. డి ఎస్ఎస్ఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బోనగిరి కోటను అత్యంత వైభవంగా అభివృద్ధి చేస్తాం



**యాదాద్రి భువనగిరి జూన్ 22 మహా** : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి కోట పర్యాటక అభివృద్ధి పనులను సోమవారం పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, పురావస్తు శాఖ డైరెక్టర్ డా. అర్జున రావు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. భువనగిరి కోట క్రింద రోప్ వే, హోటల్ నిర్మాణం, పర్యాటకులకు మౌలిక సదుపాయాలు, కొండ పైన జరుగుతున్న అభివృద్ధి పనులపై మంత్రి ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. అధికారులు, అక్కడ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. వివిధ విభాగాల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని అసహనం వ్యక్తం చేశారు కొండ క్రింద (లోయర్ స్టేషన్ లో) రోప్ వే నిర్మాణం, హోటల్, పార్కింగ్, రెస్ట్ రూమ్స్, చిల్డ్రన్ ప్లే ఏరియా, రాక్ గార్డెన్ కు విద్యుత్ దీపాల అలంకరణ, కొండపైన (అప్పర్ స్టేషన్) కోట పునరుద్ధరణ, వాటర్ బాడీస్ బ్యూటిఫికేషన్, కేఫెటేరియా, కోట చరిత్రని తెలియజేయడానికి ఇంటర్ప్రిటేషన్ సెంటర్, మెట్ల పునరుద్ధరణ, ఎంట్రన్స్ ప్లాజా, టికెట్ కౌంటర్, వెయిటింగ్ లాంజ్, రెస్టారెంట్, పర్యాటకులకు మౌలిక సదుపాయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ భువనగిరి కోటను అత్యంత ఆధునీకరణ చేస్తున్నామని కోట వైభవం ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు అక్టోబర్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పగలు, రాత్రి పనులు చేపట్టాలని ఆదేశించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు గత పాలకులు పర్యాటకాన్ని నిర్లక్ష్యం చేశారు. కనీస వసతులు కూడా కల్పించలేదు నూతన పర్యాటక విధానాన్ని తీసుకువచ్చి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్య పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, పర్యాటకం ద్వారా సంపద సృష్టి, ఉద్యోగ ఉపాధి కల్పన లక్ష్యంగా సమగ్ర కార్యాచరణతో ముందుకుసాగుతున్నాం 2047 నాటికి తెలంగాణను అంతర్జాతీయ స్థాయి ఆధాత్మిక, వారసత్వ సాంస్కృతిక పర్యాటక కేంద్రంగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. యాదాద్రి, భువనగిరి కోట, కొలనుపాకలను అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక-వారసత్వ పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందనీ తెలంగాణలోనే కాకుండా, భారతదేశం మొత్తంలోనే అత్యంత విశిష్టమైన బౌద్ధ వారసత్వ క్షేత్రాల పరిరక్షణ, పునరుద్ధరణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దేశ, విదేశీ పర్యాటకులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం స్వదేశ్ దర్శన్ స్కీమ్ 2.0 కింద వ్యయం రూ. 56.81 కోట్ల అంచనా వ్యయంతో భువనగిరి కోటను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం వారసత్వ పరిరక్షణ, ఆధునిక సదుపాయాలు, పర్యాటక అనుభవాల మెరుగుదల, రోప్‌వే ఏర్పాటు ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషికి తెలంగాణ ప్రజలు మద్దతు తెలపాలి కనీసం నెలకు రెండు సార్లు పర్యాటక ప్రాంతాలను సందర్శించి, తెలంగాణ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని కోరారు కుటుంబంతో ఆహ్లాదంగా గడపడం వల్ల మానసికొల్లాసం కలుగుతుంది. ఆలోచన విధానం మారుతుందని అన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లడుతూ ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట ..

- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీని చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్..

**రాజేంద్రనగర్ మహా;** సీఎం రేవంత్ రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శంషాబాద్ జిహెచ్ఎంసి కార్యాలయంలో సోమవారం ఇందిరా మహిళా శక్తి చీరలను డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది అన్నారు. మహిళా సాధికారతకు దోహదపడే అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తోందని పేర్కొన్నారు. మహిళలకు 32 వేల ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలు,అధికారులు, పార్టీ నాయకులు జిహెచ్ఎంసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఉద్యోగులకు ప్రమాద బీమా

**భద్రాద్రి బ్యూరో, మహా** :సింగరేణి ఉద్యోగుల సంక్షేమం కోసం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సింగరేణి సంస్థ సోమవారం కొత్తగూడెం ప్రధాన కార్యాలయంలో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం సెంట్రల్ బ్యాంక్‌లో శాలరీ అకౌంట్ కలిగిన ఉద్యోగులకు రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్ల వరకు ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బీమా సదుపాయం లభించనుంది. సింగరేణి సీఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు, డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు చొరవతో ఈ ఒప్పందం కుదిరింది. ఉద్యోగులకు మరికొన్ని బ్యాంకింగ్ రాయితీలు కూడా ఇందులో పొందుపరిచారు. జీఎం (పర్సనల్) వెల్ఫేర్, సీఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. అనంతరం సింగరేణి, సెంట్రల్ బ్యాంక్ ప్రతినిధులు ఒప్పంద పత్రాల పై సంతకాలు చేశారు.



# కేటీఆర్ పై డీసీసీ అధ్యక్షుడి విమర్శలు

**ఆదిలాబాద్ మహా** : కేటీఆర్ సిరికొండ పర్యటన పరామర్శ కాదని రాజకీయ లబ్ది కోసమేనని ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో శ్రేణులతో కలిసి ఆయన మీడియా సమావేశం లో మాట్లాడారు. ఇటీవల సిరికొండ లో పర్యటించిన కేటీఆర్ ఓ రైతు శవాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఆయన చేసిన హంగు ఆర్భాటాలను చూస్తే ఆది పరామర్శించడానికి వచ్చినట్టు లేదని కేటీఆర్ తన సొంత ఎలక్షన్ ప్రచారం కోసం వచ్చినట్టుందని ఎద్దేవా చేశారు, గత పది సంవత్సరాలు టిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 349 కోట్ల విలువైన జొన్నలు మాత్రమే కొనుగోలు చేసిందని. కానీ తెలంగాణ రాష్ట్రంలోని రైతు సంక్షేమం కోరే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కేవలం రెండు సంవత్సరాలలో 800 కోట్ల విలువైన జొన్నలు కొనుగోలు చేసిందని ఆయన అన్నారు. కేటీర్ ఇంగ్లీషులో మాట్లాడితే మేధావి అనుకుంటున్నారని, కేటీఆర్ కు తెలంగాణ ప్రజల సమస్యలపై అవగాహన లేదని ఆయన అన్నారు. అనంతరం సంఘటన్ శ్రీజన్ అభియాన్ లో భాగంగా కొత్తగా నియమింపబడ్డ మండల , పట్టణ అధ్యక్షుల కు నియామక పత్రాలు అందించి వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు. మండలాధ్యక్షులు కుల మత వర్గ భేదాలు లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను తెలంగాణలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన అన్నారు. అనంతరం ఎస్ ఐ ఆర్ "ప్రక్రియలో ప్రజల ఓటు హక్కును కాపాడే అతి పెద్ద బాధ్యత మండల అధ్యక్షుల పైన ఉందని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో బోత్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ,నాయకులు గంద్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి, సాజిద్ ఖాన్ , కౌడాల నారాయణ , దామోదర్ రెడ్డి , సుధాకర్ గౌడ్ గారు, మాధవ్ పటేల్ , గౌలి సంజయ్ , దేవిదాస్ చారి తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కోసం ఉత్సాహంగా 2కే రన్

- **ఎస్ ఐఆర్ పై అవగాహన**

**ఆదిలాబాద్ మహా**: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం SIRపై అవగాహన కోసం జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి నిర్వహించిన 2K రన్ ఆయన జెండా ఊపి ప్రారంభించారు.స్వచ్ఛమైన ఓటర్ల జాబితా కోసం పరుగెత్తుదాం అనే నినాదంతో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి ప్రారంభమై కలెక్టరేట్ చౌక్, ఎన్టీఆర్ చౌక్ మీదుగా తిరిగి స్టేడియం వద్దకే చేరుకుంది. 2K రన్ విజేతలకు ప్రశంస పత్రాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అధికారులతో కలిసి అందజేశారు. అనంతరం మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా 'నషా ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ, 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేయాలని ఆయన అన్నారు. గతంలో 2002 నాటి ఓటర్ల గణన ఆధారంగా ప్రస్తుతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని, ప్రజల ఇండ్ల వద్దకు వచ్చే ఎన్యుమరేటర్లు అడిగే వివరాలను అందించాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి ఇవ్వడం ద్వారా ఓటర్లు తమ ఓటును భద్రపరుచుకోవాలని కోరారు. ఎన్నికల సంఘం ప్రతి 20 ఏళ్లకు ఒకసారి ఈ విధమైన ప్రత్యేక సవరణ ప్రక్రియను చేపడుతుందని, దీనివల్ల అనవసరంగా ఓట్లు తొలగిపోతాయనే అపోహలు ఎవరూ పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ స్రవంతి, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డిడబ్ల్యుఓ మిల్కా, డిఈఓ మాధవి, డివైఎస్ఓ దయానంద్ రెడ్డి, డిఎంహెచ్ఓ సాధన, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, తహసిల్దార్ శ్రీనివాస్, యువత, పట్టణ ప్రముఖులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# నరసింహ కుంటను పరిశీలించిన ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు

- **పట్టా భూములోనే నిర్మాణాలు చేస్తున్నాం..**

**రాజేంద్రనగర్ మహా;** శంషాబాద్ జోన్ పరిధిలోని పెద్ద గోల్కొండ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 80,81లో నరసింహ కుంట ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ లో నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులకు తెలవడంతో, సోమవారం ఇరిగేషన్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు నరసింహ కుంటను సందర్శించారు. నిర్మాణం జరుగుతున్నా తీరును క్షేత్రస్థాయిలో వెళ్లి అధికారులు పరిశీలించారు. ఎఫ్ టి ఎల్ బఫర్ జోన్ లో పోసిన మట్టిని తొలగించాలని అధికారులు ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు నరసింహ కుంటను సందర్శించి అదుబందులు ఏర్పాట చేసేంత వరకు పనులను నిల్పుదాల చేయాలని సూచించారు. 2007లోనే అనుమతి తీసుకొని ఫంక్షన్ హాల్ను నిర్మించాం. 2007 నుండి గ్రామ పంచాయతీకి అన్ని టాక్స్ లు కడుతున్నామని చిన్న గోల్కొండ సొసైటీ సభ్యులు అనంత్ రెడ్డి తెలిపారు. 2014 లో ప్రవేట్ కంపెనీతో సర్వే చేయించి ఇప్పటివరకు నర్సంహ కుంట అదు బంధువులు నిర్ణయించలేదు. ఆరు ఎకరాలు నరసింహ కుంటను నేడు 35 ఎకరాలుగా రికార్డులో నమోదు చేశారు. చిన్న గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ వద్ద ఎకరాకు సుమారు 15 కోట్లు విలువ చేసే భూమిని 35 ఎకరాలుగా రికార్డులలో నమోదు చేశారు. సర్వే చేసి సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు ఎలాంటి అదు బంధువులు నిర్ణయించలేదు. తన పట్టా భూమిలో నిర్మాణాలు జరుగుతుంటే ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ లో నిర్మాణాలు జరుపుతున్నారని నిర్మాణ పనులు ఆపివేశారు. లేని భూమిని రికార్డులో ఉన్నట్టు చూపించారు. రికార్డులో ఉన్న భూమిని పొజిషన్లో చూపించాలి కదా అని అధికారులను అనంతరెడ్డి ప్రశ్నించారు. హైడ్రా ఇరిగేషన్ అధికారులు నరసింహ కుంటను మరోసారి సర్వే నిర్వహించి అదుబందులు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

# నీట్ అవకాశం కోల్పోయిన విద్యార్థిని

**ట్రాఫిక్ జామ్‌తో ఒక్క నిమిషం ఆలస్యం**

**మణుగూరు, మహా** :మణుగూరు నుంచి కొత్తగూడెంకు నీట్ పరీక్ష రాయడానికి వెళ్తున్న ఓ విద్యార్థిని మార్గమధ్యంలో ఏర్పడిన భారీ ట్రాఫిక్ జామ్ కారణంగా పరీక్ష కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యంగా చేరి అవకాశం కోల్పోయింది. ఈ ఘటనపై రేణుక అక్షర మహిళా మండలి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇసుక లారీల అధిక రద్దీ, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని ఆరోపించింది. బాధ్యులైన ఆర్టీవో, బ్రేక్ ఇన్స్పెక్టర్లపై చర్యలు తీసుకుని, ట్రాఫిక్ సమస్యలకు కారణమైన వారిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది.

# సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి బ్యూరో, మహా**:ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందనతో కలిసి వినతులు ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత సామూహిక సమస్యలను శ్రద్ధగా విని ప్రతి వినతిపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిగణించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం ద్వారా సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వెంటనే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం లేదా జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని ప్రజా సేవలో పారదర్శకత జవాబుదారీతనం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజావాణిలో అందిన పలు వినతులను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.

**ప్రజావాణిలో వచ్చిన కొన్ని దరఖాస్తులు**

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన వేపల లక్ష్మి తాను ఇంజినీరింగ్ పూర్తి చేశానని భర్త అనారోగ్యంతో బాధపడుతుండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఇద్దరు పిల్లల సంరక్షణ బాధ్యత తనపై ఉందని పేర్కొంటూ అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ ఉపాధి కల్పన అధికారికి తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన షేక్ సఫియా తాము నివాసం ఉంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని వర్షాకాలంలో వర్షపు నీరు ఇంట్లోకి చేరుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.

దమ్మపేట మండలం మల్లారం మోడల్ కాలనీకి చెందిన మోదంపరుపు సత్యవతి తాము నిరుపేద కుటుంబానికి చెందినవారమని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తమకు ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని కోరుతూ సమర్పించిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఎండార్స్ చేశారు.టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామపంచాయతీకి చెందిన గ్రామస్తులు తమ గ్రామ పరిధిలోని చెరువులు వాగుల్లో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. గతంలో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉమ్మడి గ్రామపంచాయతీ పేరుతో కొనసాగిందని నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు నేపథ్యంలో రామచంద్రునిపేట గ్రామపంచాయతీ ఏర్పడినందున ఆ గ్రామపంచాయతీ పేరుతో కొత్త మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి మంజూరు చేయాలని కోరారు. ఈ వినతిని పరిశీలించిన కలెక్టర్ జిల్లా మత్స్యశాఖ అధికారికి తగు చర్యల నిమిత్తం ఎండార్స్ చేశారు.

పాల్వంచలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో పార్ట్‌టైమ్ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న విజయనిర్మల పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఆరుగురు విద్యార్థులు తెలుగు సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేదనే కారణంతో తనను విధుల నుండి తొలగించారని పేర్కొన్నారు. జిల్లాలోని ఇతర పాఠశాలల్లో ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులను తొలగించలేదని తనకు న్యాయం చేసి తిరిగి విధుల్లో కొనసాగేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్‌సీఓకు ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు తీపి కబురు

**పంటల కొనుగోళ్ళ నిధులు విడుదల నేరుగా అకౌంట్ లో జమ**

**ఆదిలాబాద్ మహా :** రైతాంగానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఓ తీపి కబురు అందించారు. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసిన మొక్కజొన్న, జొన్న పంటలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేస్తున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో 3,819 మంది రైతుల నుంచి ప్రభుత్వం మద్దతు ధరతో 2.19 లక్షల క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేసింది. దీని మొత్తం విలువ రూ.52.63 కోట్లు. ఇందులో మొదటి విడతగా రూ.31.08 కోట్లను 2,624 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు.మిగిలిన రూ.21.55 కోట్లలో భాగంగా తాజాగా రెండో విడతగా రూ.11.22 కోట్లు ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాకు విడుదలయ్యాయని పేర్కొన్నారు. మిగిలిన రూ.10.33 కోట్లు కూడా అతి త్వరలో విడుదల కానున్నాయని తెలిపారు. జిల్లాలో 25,591 మంది రైతుల నుంచి రూ.270.59 కోట్ల విలువైన 7.31 లక్షల క్వింటాళ్ల జొన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేసిందని, ఇందులో భాగంగా మొదటి విడతగా రూ.83.46 కోట్లను విడుదల చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిగిలిన బకాయిలను కూడా దశలవారీగా త్వరలోనే చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.తాజాగా విడుదలైన మొక్కజొన్న నిధులు రూ.11.22 కోట్లు, జొన్న నిధులు రూ.83.46 కోట్లు జూన్ 22 నుంచే రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.రైతులందరూ తమ బ్యాంకు ఖాతాలను పరిశీలించాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత కొనుగోలు కేంద్రాలు లేదా మార్క్‌ఫెడ్ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.



# ఆదివాసీల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా ఉద్యమం అవసరం..

- **జాతీయ సమావేశ వివరాలు వెల్లడించిన డాక్టర్ కొమరం లక్ష్మణరావు**

**మణుగూరు, మహా**: గుజరాత్ రాష్ట్రంలోని జట్లాపూర్‌లో నిర్వహించిన అఖిల భారతీయ ఆదివాసీ వికాస పరిషత్ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా సంఘటిత ఉద్యమం అవసరమని నిర్ణయించినట్లు జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కొమరం లక్ష్మణరావు సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 21న గుజరాత్ రాష్ట్రంలోని జట్లాపూర్‌లో ఘనంగా నిర్వహించిన జాతీయ కార్యవర్గ సమావేశానికి దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరై ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివాసీల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాల అమలు, సామాజిక సమస్యల పరిష్కారం వంటి అంశాలు సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం తరఫున తాను, ముక్తి భాస్కరరావు ఈ సమావేశంలో పాల్గొని రాష్ట్రంలోని ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షులు సోమజీ భాయ్ దమోర్, పగ్గాన్ సింగ్ కులస్తే (ఎంపీ, మాజీ మంత్రి), జాతీయ మహిళా అధ్యక్షురాలు గీతా శ్రీ ఓరన్, ప్రధాన కార్యదర్శి శంకరలాల్ బోధత్ తదితర ప్రముఖులు పాల్గొన్నట్లు వివరించారు. ఆదివాసీల హక్కుల సాధన, సంక్షేమం, సమగ్ర అభ్యున్నతి కోసం అఖిల భారతీయ ఆదివాసీ వికాస పరిషత్ నిరంతరం కృషి చేస్తుందని డాక్టర్ కొమరం లక్ష్మణరావు తెలిపారు.

# కార్మిక హక్కులను కాలరాస్తున్న పాలకులు

- **సీఐటీయు తోనే కార్మికుల సంక్షేమ బోర్డు**
- **కార్మికుల సంక్షేమానికి తపించిన మేస్త్రీ వీరయ్య**



**కారేపల్లి, మహా** : కేంద్ర,రాష్ట్ర పాలకులు కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం కారేపల్లి మండల విశ్వనాధపల్లిలో భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయు) సింగరేణి మండల గౌరవ అధ్యక్షులు చిత్తులూరి వీరయ్య సంస్మరణ సభ శనగ రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈసభలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ సరళీకృతం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానం 4 లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. కార్మిక చట్టాల రద్దుతో యాజమాన్యల దయా దక్షణ్యాలపై కార్మికుల భవిష్యత్తు ఆధారపడిందన్నారు. 8 గంటల పని నుండి 12 గంటల పని అమలు కానుందని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులకు సీఐటీయు పోరాట ఫలితంగా దేశవ్యాప్తంగా సాధించుకున్న సంక్షేమ బోర్డు పరిధి కుషించే పన్నాగం నడుస్తుందన్నారు. దానిలో భాగంగానే కార్మికుల సంక్షేమానికి వినియోగించాల్సిన వెల్ఫేర్ బోర్డు నిధులను ఇతర రంగాలను తరలిస్తున్నారని తెలిపారు. కార్మికులను అన్యాయం చేసే 4 లేబర్ కోడ్ లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయమని చెప్పిన కాంగ్రెస్ నేడు లేబర్ కోడ్ ల అమలుకు సన్నహాలు చేస్తుందని విమర్శించారు. తన వద్ద పని చేసే కార్మికుల సంక్షేమానికి పరితపించే వ్యక్తి వీరయ్య మేస్త్రీ అని కొనియాడారు. భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీను, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు లు మాట్లాడుతూ నిత్యం 100 మందికి పని కల్పించటమే కాకుండా వారి సంక్షేమం చూచే వ్యక్తి కాబట్టే వీరయ్య మేస్త్రీ అందరి అభిమానాన్ని చూరగొన్నారన్నారు. వివాద రహితుడైన మేస్త్రీ వీరయ్యను రక్షించుకోవటానికి కుటుంబ సభ్యులే కాకుండా సీఐటీయు, సీపీఐ(ఎం) తరుపున ఎంతో పరితపించారని అయినా వీరయ్యను రక్షించలేకపోయామన్నారు. నిర్మాణ రంగంలో తన నైపుణ్యం, రాజీలేనితనంతో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయికి ఎదిగారని కొనియాడారు. కార్మికుల వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు జరిగిన పోరాటాలలో వీరయ్య పాత్ర శ్లాఘనీయమన్నారు. వేల్ఫేర్ బోర్డు నుండి నిర్మాణ కార్మికులకు లబ్ధి చేకూరటానికి తపించే వారన్నారు. ఈ కా ర్య క్ర మం లో సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర, హమాలీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ముక్కా సీతా రాములు, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.కె హుస్సేన్, ఉపసర్పంచ్ బొమ్మల ధనమ్మ, ఎస్ఎస్ఎస్ ట్రిక్స్ అధినేత వీరెల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెసు నాయకులు పగడాల మంజుల, అడ్డగోడ ఐలయ్య, తిరుమలరావు, బీఆర్ఎస్ నాయకులు హన్మకొండ రమేష్, బీజేపీ నాయకులు తురక నారాయణ, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు రేగళ్ల మంగయ్య, వల్లభినేని మురళి, వడ్డె అజయ్ బాబు, తలారి దేవప్రకాష్, కరకపల్లి రాయమల్లు, పాసిన్ని నాగేశ్వరరావు, భాగం వెంకటప్పారావు, సీఐటీయు నాయకులు ఎస్.కే.సైదులు, అబ్దుల్ వాహేద్, మున్నా, కిరణ్. ఆదెర్ల వినయ్ కుమార్, ఆరెల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# సేవ్ మణుగూరు పోరాటాన్ని ఉధృతం చేస్తాం..

- **పీకే ఓసీ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి..**
- **రిలే నిరాహార దీక్షలకు ఎమ్మెల్యే కూనంనేని మద్దతు**



**మణుగూరు, మహా**: మణుగూరు భవిష్యత్తు, ఈ ప్రాంబత కార్మికుల ఉపాధి రక్షణ కోసం చేపట్టిన సేవ్ మణుగూరు పోరాట కార్యక్రమాన్ని మరింత ఉధృతం చేస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల రిలే నిరాహార దీక్షలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మణుగూరుకు అత్యంత కీలకమైన పీకే ఓసీ2 డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని, అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న మణుగూరు ఓసీపీ మూసివేయక ముందే విస్తరణ అనుమతులు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం కారణంగా దేశంలోని బొగ్గు గనులను వేలం ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం కూడా ఈ చట్టానికి మద్దతు ఇవ్వడంతో తెలంగాణలోని బొగ్గు బ్లాకులు వేలానికి వెళ్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణలోని అన్ని బొగ్గు బ్లాకులను సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. మణుగూరులో సింగరేణి కార్యకలాపాలు దెబ్బతింటే వేలాది మంది కార్మికులు, ఒప్పంద కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. మణుగూరు ప్రాంత అభివృద్ధి మొత్తం సింగరేణిపై ఆధారపడి ఉందని పేర్కొంటూ భద్రాద్రి విద్యుత్ కేంద్రం, హెవీ వాటర్ ప్లాంట్, భద్రాచలం పేపర్ బోర్డు వంటి పరిశ్రమలు కూడా సింగరేణి బొగ్గుతోనే అభివృద్ధి చెందాయని గుర్తు చేశారు. గనులు కేటాయించకపోతే మణుగూరు భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు సింగరేణిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం సరికాదన్నారు. గత ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీలు చేస్తున్న ప్రచారాన్ని తప్పుబట్టారు. 140 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొనడానికి రాజకీయ జోక్యం, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 56 వేల కోట్ల రూపాయల బకాయిలు ప్రధాన కారణమని పేర్కొన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం, సేవ్ మణుగూరు ఉద్యమం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ, ఏఐటీయూసీ కట్టుబడి ఉంటాయని తెలిపారు. పీకే ఓసీ2 డిప్‌సైడ్ బ్లాక్, మణుగూరు ఓసీపీ అనుమతులు వెంటనే ఇవ్వాలని, లేకుంటే అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కొనసాగుతున్న ఈ రిలే నిరాహార దీక్షలకు ఎమ్మెల్యే కూనంనేని సంఘీభావం తెలుపుతూ దీక్షలో పాల్గొన్న నాయకులకు పూలమాలలు వేసి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కే రాజ్‌కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, శాఖ కార్యదర్శి వై రాంగోపాల్, సీపీఐ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా రాష్ట్ర నాయకురాలు మున్నా లక్ష్మీకుమారి, పట్టణ పార్టీ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, ఉపాధ్యక్షుడు మల్లెల రామ నరసయ్య, సహాయ శాఖ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, సంయుక్త కార్యదర్శి జి పుల్లారావు, నాయకులు ఆవుల నాగరాజు, బి సురేందర్‌రావు, ఆధర్ల సురేందర్, ఎస్ కుమార్‌స్వామి, జి శ్రీనివాసరావు, ఈసం శ్రీనివాస్, రత్నం శివ, బి రవికుమార్, ఆంతోటి రవికుమార్, సాయి ప్రకాశ్ చారి, సతీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, భద్రతా కమిటీ సభ్యులు, ప్రతినిధులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మణుగూరు మెడికల్ షాప్ అసోసియేషన్, తెలుగుదేశం పార్టీ, టీయూసీఐ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి తమ మద్దతు ప్రకటించారు.

# రైతులకు అండగా నిలిచింది కాంగ్రెస్ ప్రభుత్వమే..

- **చౌకబారు ఆరోపణలు మానుకోవాలి**
- **కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్**




**మణుగూరు, మహా** : రైతుల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తూ, వారు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి బోనస్ అందజేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పీరినాకి నవీన్ పేర్కొన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల చౌకబారు ఆరోపణలను ప్రజలు నమ్మరని అన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, రైతు భరోసా, ధాన్యం కొనుగోలు, బోనస్ చెల్లింపుల ద్వారా రైతులను ఆదుకుంటున్నది ప్రజా ప్రభుత్వమని చెప్పారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రస్తుత ప్రభుత్వం రైతుల పట్ల పూర్తి చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు గత పదేళ్ల పాలనలో రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. వరి పండిస్తే ఉరి అంటూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా పాడుచేసిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదేనని ఆరోపించారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని తప్పుడు ఆరోపణలు మానుకోవాలని, లేకుంటే రైతులు, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భువనగిరి శివ సైదులు, జిల్లా కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, మైనార్టీ అధ్యక్షుడు రహీమ్ పాషా, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్, సీనియర్ నాయకులు కుర్రం రవి, యాకుబ్ అలీ, కోర్లకుంట అప్పారావు, తాత ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

# హరితహారం పేరుతో గుంజుకున్న పేదలభూములను తిరిగి ఇవ్వాలి

**కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన న్యూడెమోక్రసీ**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఆదివాసీ ప్రాంతాలలో హరితహారం పేరుతో ఫారెస్ట్ వారు ఆక్రమించుకున్న భూములను తిరిగి ఇవ్వాలని గ్రామాలలో అట్టి భూముల లీస్ట్ ని గ్రామ పంచాయతీలలో బహిరంగ పరచాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు, జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ అంకిత్ కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. అనంతరం జిల్లా నాయకులు ఎస్కే ఉమర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆవు నూరి మధు, గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాలలో గ్రామ సభ తీర్మానాలు గ్రామసభ ఆమోదం లేకుండా పీసా 1/70 చట్టాలు ఉన్న ఫారెస్ట్ వారు వెళ్లి ఆదివాసీలు ఐదు ఎకరాలు కలిగినటువంటి గిరిజనేతరుల భూములను కూడా బలవంతంగా లాక్కొని మొక్కలు నాటారని నిరుపేదలైనటువంటి వారి దగ్గర భూములు లాక్కోవడం మంచిది కాదని వాటిని తిరిగి ఇవ్వాలని కోరారు. గిరిజనేతరుల దగ్గర 30, 40 ఎకరాలు ఉన్న వారి జోలికి ఫారెస్ట్ వారు ఎందుకు పోవడం లేదని ప్రశ్నించారు. గుత్తి కోయలు ఆదివాసీలు పేద గిరిజనేతరుల భూములే ఎందుకు గుంజుకున్నారని వారు అన్నారు. పీసా యాక్ట్ అటవీ హక్కుల చట్టం 1/70 యాక్ట్ చట్టాలను ఉల్లంఘించి ఫారెస్ట్ వారు ఎలా భూములను ఆక్రమించుకున్నారో బహిరంగ పరచాలని అలా చేసిన వారిని శిక్షించాలని కోరారు. కొంతమందికి వేరే చోట ఇస్తామని ఆశ చూపి ఉన్న భూమిని లాక్కొని వాళ్లని నిరాశ్రయులుగా చేశారని వారు కూలీలుగా మారారని అన్నారు. తక్షణమే వీటిపై కలెక్టర్ స్పందించి రీ సర్వేలు నిర్వహించి పేదవారికి న్యాయం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు కుంజ కృష్ణ మోత్కూరి మల్లికార్జున రావు ఉప్పరపోయిన రామ్మూర్తి కోరం సీతారాములు గడ్డం లాలయ్య పర్శిక రవి సవాళ్ల ఆది నారాయణ మడకం సంధ్య ఇంటికి లక్ష్మి లిక్కి నరేష్ హిడామ పద్దం వెంకన్న మంకెన వెంకటేశ్వర్లు రమ రాధా కలవల రాణి తదితరులు పాల్గొన్నారు. ఈ ధర్నాకు సంఘీభావంగా టిఆర్ఎస్ జిల్లా నాయకులు వీరన్న ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు వాసం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి


**జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి బ్యూరో, మహా:** వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం కలెక్టర్ అంకిత్ జిల్లా వ్యాప్తంగా వైద్యాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది విధి నిర్వహణ ప్రధాన కార్యాలయ హాజరు సేవల అందజేతపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యాధికారులు ఆరోగ్య సిబ్బంది విధిగా ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉండాలని విధి సమయాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఎటువంటి అంతరాయం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన మాతృ మరణ ఘటనల నేపథ్యంలో ప్రతి వైద్యాధికారి మరింత బాధ్యతతో పనిచేయాలని గర్భిణీల పర్యవేక్షణ అత్యవసర వైద్య సేవలు రెఫరల్ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ తుకారం రాథోడ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఆదేశించారు. సమయపాలన పాటించని వైద్యాధికారులపై కఠినమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు . జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది అందరు కలెక్టర్ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని జిల్లాలో అన్ని ఆరోగ్య సంస్థల్లో హాజరు సేవల నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## పెన్షన్ క్లెయిమ్‌లకు జాప్యం వద్దు

**భద్రాద్రి బ్యూరో, మహా :** సింగరేణి ఉద్యోగుల సిఎంపిఎఫ్ పెన్షన్ క్లెయిమ్‌లను త్వరితగతిన సెటిల్ చేయాలని, కార్మిక సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని సింగరేణి డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పొట్రు ఆదేశించారు.సోమవారం సింగరేణి భవన్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎంపిఎఫ్ ప్రాంతీయ కమిషనర్లు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పదవీ విరమణ పొందే ఉద్యోగుల పెన్షన్ క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా సింగరేణి, సిఎంపిఎఫ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉద్యోగుల సంక్షేమమే సంస్థ ప్రాధాన్యమని పేర్కొన్న గౌతమ్ పొట్రు, పెండింగ్ క్లెయిమ్‌లను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో సింగరేణి, సిఎంపిఎఫ్ అధికారులు పాల్గొన్నారు.



## వ్యభిచారానికి అడ్డు చెప్పిన గ్రామస్తులపై కత్తితో దాడి

**నిందిత దంపతులు పరారీ**

**బాధితులను పరామర్శించిన మట్టా దయానంద్**

**సత్తుపల్లి, మహా :** సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామ శివారులో వ్యభిచార కార్యకలాపాలను అడ్డుకోవాలని ప్రశ్నించిన ఇద్దరు గ్రామస్తులపై నిర్వాహకులు కత్తులతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో మారోజు నాగేశ్వరరావు, నక్కా వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.గ్రామ సమీపంలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ కార్యకలాపాలు కొనసాగడంతో ఆదివారం రాత్రి వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో నిర్వాహకులైన నాగమణి, హనుమంతరావు దంపతులు కొబ్బరి బోండాలు నరికే కత్తులతో దాడికి పాల్పడినట్లు సమాచారం.గాయపడిన వారిని స్థానికులు సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, నిందితులు పరారయ్యారు. ఘటన స్థలంలో ఉన్న ఓ యువతిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.


## డ్రైనేజీ ఆక్రమణలు తొలగింపుకు పంచాయతీ మలిదశ తీర్మానం



**దమ్మపేట ,మహా :** మండల కేంద్రం లోని ప్రధాన రహదారి కి ఇరువైపులా ఆక్రమణ గురైన పంచాయతీ డ్రైనేజీలను కాపాడుకునేందుకు పంచాయతీ పాలక వర్గం ఎట్టకేలకు తీర్మానం చేసింది. సోమవారం పంచాయతీ కార్యదర్శి బండి అనంత కుమార్ అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో సర్పంచ్ పగడాల రమాదేవి ,ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాస రావు సమక్షంలో పాలకవర్గ సబ్యులు 14మంది ఈ తీర్మానం పట్ల ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. మండల కేంద్రాన్ని సుందరీకరణ చేసే దిశగా ప్రజాపాలకులు చేపట్టిన డ్రైనేజీ ప్రక్షాళనకు గ్రామస్తులు సహకరించాలని కార్యదర్శి సూచించారు. ముఖ్యంగా డ్రైనేజీలపై స్లాబులు , నిర్మాణాలు చేసినవారు స్వతహాగా తొలగించి పంచాయతీ కి సహకరించాలని షాపుల యజమానులకు తెలిపారు. ఇప్పటికే వివిద దఫాలుగా షాపుల వారికి నోటీసులు జారీ చేసి హెచ్చరికలు చేశామని , మైక్ ప్రచారం ద్వారా బహిరంగంగా ప్రకటన విడుదల చేసినప్పటికీ షాపుల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. చివరకు పోలీసు ,రెవిన్యూ ,ఆర్ అండ్ బి పంచాయతీ అధికారుల జోక్యం తో మిషనరీలు ఉపయోగించి డ్రైనేజీ ఆక్రమణలు తొలగించే పరిస్థితి ఎదురైందని ఆవేధన చెందారు. గ్రామం బాగుంటేనే ప్రజలు బాగుంటారు అనే సూక్తి తో గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

**స్వార్ధం కోసం రెచ్చగొడితే**

స్వార్ధ పరులు కొందరు తమ ఉనికిని చాటుకోవడం కోసం అమాయకులైన చిరువ్యాపారులకు లేనిపోని విషయాలు అంటకడుతూ ముందుకు నెట్టే ప్రయత్నం చేస్తున్నారనే సమాచారం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఎందుకోసం ఇలా చేస్తున్నారనే విషయాన్ని యువత ,గ్రామ పెద్దలు ఆలోచన చేసి గ్రామంలో సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని మేధా వర్గం కోరుతున్నారు. మార్పు అనేది కొంతమందితోనే ప్రారంభం అవుతుందనే నమ్మకాన్ని అక్షరాల నిజం చేసుకోవడానికి ఇదే అసలైన అవకాశం గా ప్రజలు భావించాలని కొందరు మేధావులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా పట్టణానికి క్రొత్త దనం రావడం ఖాయమని ఆనందంలో ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.




## డ్రగ్స్ రహిత సమాజమే మనందరి లక్ష్యం కావాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**

**మహా వరంగల్ క్రైం;** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే మనందరి ప్రధాన లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకోని మత్తు పదార్థాల నియంత్రణ విభాగమైన తెలంగాణ ఈగల్ ఫోర్స్ విభాగం మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రచారం కల్పిస్తూ నూతనంగా రూపోందించిన వాల్ పోస్టర్ల ను వరంగల్ పోలీస్ కమషనర్ సోమవారం అవిష్కరించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సోమవారం నుండి వారం రోజులు పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్ నిర్వహించే అవగాహన కార్యక్రమాల పై వరంగల్ పోలీస్ కమిషనర్ సిసిఆర్‌బి ఏసిపి డేవిడ్ రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ముమ్మరంగా ప్రచారం కొనసాగించాలని, ముఖ్యంగా పాఠశాలలు, కళాశాల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకుగాను పెద్ద సంఖ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పనిచేసే సైనికుడిగా విద్యార్థులను తీర్చిదిద్దాలని, యువతను మత్తు బానిసలుగా మారకుండా యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేసారు. అనంతరం తెలంగాణ ఈగల్ ఫోర్స్ జారీ చేసిన "ఐయామ్ ఏ యాంటీ డ్రగ్స్ సోల్జర" ఫోటో బూత్‌లో పోలీస్ కమిషనర్ ఫోటో దిగి యువతకు స్ఫూర్తినిచ్చారు.

ఈ కార్యక్రమములో ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్, ఏసిపిలు డేవిడ్‌రాజు, జాన్నర్సింహులు, వెంకటేష్, ఇన్స్‌స్పెక్టర్ సంజీవ్‌రావు, దామెదార్ రెడ్డి, మల్లయ్య,సురేష్ పాల్గోన్నారు.




## పవన్ కళ్యాణ్ ను విమర్శించే అర్హత కవితకు ఉందా?

- **జిల్లా జనసేన పార్టీ నాయకులు**

**హన్మకొండ మహా;** ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను విమర్శించే అర్హత అసలు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు ఉందా అని జిల్లా జనసేన పార్టీ నాయకులు ప్రశ్నించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ హన్మకొండ పర్యటనలో శనివారం జనసేనాని పట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్ చేసి తీహార్ జైలులో చిప్పకూడు తిన్న కవిత కూడా నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కన్న తండ్రితో పాటు కుటుంబానికే వెన్నుపోటు పొడిచి అధికార కాంక్షతో కవిత మతి తప్పి మాట్లాడుతోందని మండిపడ్డారు. సామజిక న్యాయం గురించి కెసిఆర్ పక్కన పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు మాట్లాడలేదని వ్యాఖ్యనించారు. మరల తెలంగాణ సెంటిమెంటుతో తన రాజకీయ ఉనికి కోసం తెలంగాణ కార్డు పట్టుకొని తిరుగుతున్నందని ఎద్దేవా చేశారు.. కవిత ఎన్ని వేషాలు వేసిన ఎన్ని మాయమాటలు చెప్పినా తెలంగాణ యువత నమ్మే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ యువత జనసేన వైపు చూస్తున్నారని తెలిపారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను విమర్శిస్తే మీడియాలో ఉంటానని దిగజారి మాట్లాడుతుందన్నారు. బ్యూటీ పార్లర్ నడిపే కవిత పార్టీ నడపడానికి డబ్బు ఎక్కడిదో తెలంగాణ ప్రజలకు చెప్పాలన్నారు. అక్రమంగా తెలంగాణను కవిత కుటుంబం దోచుకొని లక్షల కోట్లు ఆస్తులు కూడ బెట్టుకున్నారని విమర్శించారు. దమ్ముంటే కవిత ఆస్తుల గురించి తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వరంగల్ తూర్పు పిఓసి సభ్యులు గద్దం రాకేష్, జిల్లా నాయకులు కొల్లూరి అనుదీప్, అమంచ సునీల్, పద్మజ రెడ్డి, గోపు నవీన్,ప్రసన్న కుమార్,దయాకర్,ప్రశాంత్ రెడ్డి,కొలిపాక వంశీ కృష్ణ, ఫరీద్, షేక్ ఆన్సర్ తదితరులు ఉన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

**ప్రజావాణిలో 64 ఫిర్యాదుల స్వీకరణ**

వరంగల్ కార్పొరేషన్, మహా: గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ జోనా అధికారులను ఆదేశించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నగర ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. విభాగాల వారీగా టౌన్ ప్లానింగ్‌కు 26, ఇంజినీరింగ్‌కు 19, రెవెన్యూకు 7, హెల్త్ అండ్ శానిటేషన్‌కు 7, నీటి సరఫరాకు 5 ఫిర్యాదులు అందగా మొత్తం 64 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో శంకర్ లింగం, ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబు, ఈఈ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.



## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్




**వరంగల్ క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జాతీయ లోక్ అదాలత్ కు విశేష స్పందన లభించిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా 10922 కేసులు పరిష్కార మయ్యాయని , సైబర్ క్రైమ్ కేసుల్లో 1 కోటి 17 లక్షలకు పైగా రిఫండ్ మొత్తాన్ని బాధితులకు అందజేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని సీపి తెలిపారు. జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉండి పరిష్కరించిన మొత్తం కేసుల్లో కేసుల్లో ఎఫ్ఐఆర్ కేసులు 1880,డిజాస్టర్ మేనేజ్మెంట్ కేసులు 2864, ఈ పెట్టి కేసులు 201, డ్రంకెన్ అండ్ డ్రైవ్, మోటార్ వెహికల్ చట్టం కేసులు 5977, సైబర్ కేసులు 197 పరిష్కరించడం ద్వారా బాధితులకు సంబంధించి వివిధ బ్యాంక్ ఖాతాల్లో నిలుపుదల చేసిన 1,17,95,706/ రూపాయలు బాధితులకు అంద జేయాల్సిందిగా కోర్టు ఉత్తర్వులు వెలు బడించిందని తెలిపారు. రాజీ మార్గమే రాజా మార్గమని, లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని అవగాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా లోక్ అదాలత్ సద్వినియోగానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయ సేవాధికారులకు కూడా ఈ సందర్భంగా సీపీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర రథసారథులకు ఘన స్వాగతం పలికిన డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ శ్రేణులు



**హన్మకొండ మహా:** వరంగల్ హనుమకొండ జిల్లాల డీసిసి అధ్యక్షులు మహమ్మద్ అయూబ్, ఇనగాల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో నగరానికి విచ్చేసిన టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసిసి కార్యదర్శి మీనాక్షి నటరాజన్ లకు మడికొండ లో కాంగ్రెస్ శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గజమాల లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు, వరంగల్ జిల్లా కల్లు గీతకార్మికుల సంఘం నాయకులు ఆరెల్లి రవి గౌడ్, కరాటే ప్రభాకర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రథసారధులకు శాలువాలు కప్పి ఆత్మీయ స్వాగతం పలికారు. హన్మకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం అలాగే వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజక వర్గ స్థాయి బి ఎల్ ఎ సమావేశానికి వీరు విచ్చేసారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గీత కార్మికులు తాళ్ల పెల్లి శ్రీను గౌడ్, తాళ్లపెల్లి శివ గౌడ్, బత్తిని పూరషోత్తం గౌడ్, రాజు గౌడ్, సోమయ్య గౌడ్, లక్ష్మి నారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి కోసం గ్రీవెన్స్ లో సిపిఎం కార్యకర్తల బైఠాయింపు

- **నగరంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలి**
- **సిపిఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యుల డిమాండ్**



మహా వరంగల్ కార్పొరేషన్ ;ఓరుగంటి సారంగపాణి నగర్ (ఓఎస్ నగర్) లో గత వారం రోజులుగా మంచినీరు రావట్లేదని ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, రామన్నపేట ఏరియా కార్యదర్శి సింగారపు బాబు అన్నారు. సోమవారం బల్దియా గ్రీవెన్స్ సెల్ లో వైఎస్ నగర్ వాసులతో బైఠాయించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సింగారపు బాబు మాట్లాడుతూ నగర ప్రజలకు మంచినీటి సరఫరా చేయడంలో బల్దియా అధికారులు పూర్తిగా విఫలమయ్యారని నగరంలో మంచినీటి పైపుల లీకేజీల కారణంగా కొన్నిచోట్ల నాలుగు నుండి ఐదు రోజుల వరకు మంచినీరు సరఫరా జరగడంలేదని అన్నారు. ప్రజల పట్ల, ప్రజా సమస్యల పట్ల మున్సిపల్ అధికారులు ఉదాసీనత విడనాడాలని కోరారు. మంచినీళ్లు సౌకర్యం కల్పించాలని గత అనేక సందర్భాల్లో మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్నా, అనేక వినతి పత్రాలు సమర్పించిన కూడా చేస్తాం, చూస్తాం అంటూ కాలం వెల్లదీస్తున్నారే గాని సమస్య మాత్రం పరిష్కరించడం లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. సంబంధిత అధికారులకు ఫోన్లు చేసినా కూడా వారు ఫోన్ ఎత్తకుండా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పేద ప్రజలు నివసించే వాడల పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి తగదని ఇప్పటికైనా తక్షణమే స్పందించి మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేటట్లు చూడాలని, లేని యెడల ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం గ్రీవెన్స్ లో అదనపు కమిషనర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వలదాసు దుర్గయ్య, ఓ ఎస్ నగర్ కార్యకర్తలు వరమ్మ, మల్లికాంబ, మైదం ఆండాళ్ళు, పద్మ, బిట్టు చంద్రకళ, హసీమ తదితరులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడు, ఏఐసీసీ ఇంచార్జ్ లకు స్వాగతం పలికిన కొండా దంపతులు



**మహా వరంగల్ బ్యూరో :** వరంగల్ జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ రావు దంపతులు ఘన స్వాగతం పలికారు.


అనంతరం వరంగల్ ఆర్&బీ గెస్ట్ హౌస్ లో వారితో ప్రత్యేకంగా సమావేశమై పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణం, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాల పై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాల పై నాయకత్వంతో అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు చేరువయ్యేలా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు సమిష్టిగా కృషి చేయాలని నాయకత్వం సూచించగా, ఆ దిశగా కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




## డ్రగ్స్‌పై అవగాహన తప్పనిసరి


**వరంగల్ క్రైం, మహా :** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మట్వాడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని లోటస్ నేషనల్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఇన్‌స్పెక్టర్ ఎన్. కరుణాకర్ రావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పోలీసులు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలు, చట్టపరమైన శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో "డ్రగ్స్‌కు నో చెప్పుదాం - ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మిద్దాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రిచ్ డాడ్ పూర్ డాడ్
# ఇద్దరు నాన్నల ఆశీర్వాదం!




ప్రసిద్ధ 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత, ప్రముఖ ఇన్వెస్టర్ రాబర్ట్ కియోసాకి ఫాదర్స్ డే సందర్భంగా భావోద్వేగపూరిత సందేశాన్ని పంచుకున్నారు. తాను ఎప్పుడూ తండ్రి కాలేకపోయినా, జీవితంలో ఇద్దరు తండ్రుల ఆశీర్వాదం పొందానని పేర్కొన్నారు. ఒకరు తన "పూర్ డాడ్", మరొకరు "రిచ్ డాడ్" అని తెలిపారు. వారి నుంచి నేర్చుకున్న జీవిత పాఠాలే తన ఆలోచనా విధానాన్ని మార్చాయని, ఆ అనుభవాలను ప్రపంచానికి "రిచ్ డాడ్ పూర్ డాడ్" పుస్తకం ద్వారా అందించగలిగానని కియోసాకి చెప్పారు. ఆ పాఠాలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది జీవితాలను సుసంపన్నం చేశాయని ఆయన పేర్కొన్నారు. "తండ్రిగా ఉండటం జీవితంలో అత్యంత ముఖ్యమైన బాధ్యత. మీరు తండ్రి అయినా కాకపోయినా, ఈ రోజు మీ నాన్నకు కృతజ్ఞతలు చెప్పండి" అని కియోసాకి తన సోషల్ మీడియా పోస్టులో పిలుపునిచ్చారు. కుటుంబ విలువలు, తల్లిదండ్రుల మార్గదర్శకత్వం జీవిత విజయాల్లో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన సందేశం ద్వారా గుర్తు చేశారు.

# బ్యాంక్ ఆఫ్ బరోడా గోల్డెన్ గోల్ స్కీమ్




ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) కొత్తగా 'గోల్డెన్ గోల్ డిపాజిట్ స్కీమ్'ని ప్రవేశపెట్టింది. దీని కింద 555 రోజుల కాలవ్యవధి డిపాజిట్లపై వార్షికంగా 7.40 శాతం వరకు వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తోంది. సాధారణ పౌరులకు 6.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.25 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.35 శాతం వడ్డీ రేటు లభిస్తుంది. రూ. 3 కోట్ల లోపు రిటైల్ టర్మ్ డిపాజిట్లకు ఇవి వర్తిస్తాయి.

**కోటక్ ఇన్ఫినిటీ లాంగ్ షార్ట్ సిఫ్..**

కోటక్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (సిఫ్) విభాగంలో ఇన్ఫినిటీ లాంగ్ షార్ట్ ఫండ్‌ని ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూన్ 29తో ముగుస్తుంది. సంప్రదాయ మ్యూచువల్ ఫండ్స్, అధునాతన పీఎంఎస్, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్)కి మధ్య అంతరాన్ని భర్తీ చేసేలా సిఫ్ కేటగిరీ ఫండ్స్ ఉంటాయి. ఇన్ఫినిటీ హైబ్రిడ్ లాంగ్-షార్ట్ ఫండ్.. ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తూ, నిర్దిష్ట డెరివేటివ్ వ్యూహాలను ఉపయోగిస్తూ, ఆర్బిట్రేజ్ అవకాశాలను అందిపుచ్చుకుంటూ మెరుగైన రాబడులను అందించే విధంగా ఉంటుందని ఫండ్ మేనేజర్ కల్పేష్ జైన్ తెలిపారు. ఒడిదుడుకుల పరిస్థితుల్లో నష్టాల రిస్కులను తగ్గిస్తూ, మార్కెట్ వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడం లక్ష్యంగా ఇది పని చేస్తుందని వివరించారు.

## రూ.3 లక్షలతో బుకింగ్..
# 50 యూనిట్లు మాత్రమే!




స్కోడా కంపెనీ తన సరికొత్త కొడియాక్ ఆర్ఎస్ కోసం బుకింగ్స్ స్వీకరించడం ప్రారంభించింది. రూ.3 లక్షల టోకెన్ మొత్తంతో ఎవరైనా బుక్ చేసుకోవచ్చు. అయితే సంస్థ 50 యూనిట్లను మాత్రమే డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది. ఆర్ఎస్ బ్యాడ్జ్ 50 సంవత్సరాల వారసత్వాన్ని దృష్టిలో ఉంచుకుని స్కోడా ఈ కారును మార్కెట్లో లాంచ్ చేసింది. సరికొత్త స్కోడా కొడియాక్ ఆర్ఎస్ విండో ట్రిమ్స్, రూఫ్ రైల్స్ వంటివి పొందుతుంది. ఇది మూన్ వైట్, మ్యాజిక్ బ్లాక్, వెల్వెట్ రెడ్, స్టీల్ గ్రే అనే రంగులలో లభిస్తుంది. ఇంటీరియర్ డిజైన్, ఫీచర్స్ అన్నీ అద్భుతంగా ఉంటాయి. ఇందులో ఎకో, కంఫర్ట్, నార్మల్, స్పోర్ట్, ఇండివిడ్యువల్, స్నో అనే డ్రైవింగ్ మోడ్స్ అందుబాటులో ఉన్నాయి. ఇంజిన్ విషయానికి వస్తే.. ఇది 2.0 TSI పెట్రోల్ ఇంజిన్ ద్వారా పనిచేస్తుంది. ఇంజిన్ 265 bhp పవర్, 400 Nm టార్క్ అందిస్తుంది. ఇది 7 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ ద్వారా శక్తి నాలుగు చక్రాలకు పవర్ డెలివరీ చేస్తుంది. దీని టాప్ స్పీడ్ 231 కిమీ/గం. కాబట్టి ఇది మంచి డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుంది.

## ఆధార్ హోల్డర్లకు ఊరట..
# ఆరు నెలల పాటు ఈ సేవ ఫ్రీ!




యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధార్ వినియోగదారులను ఊరటను ఇచ్చే ప్రకటన చేసింది. ప్రస్తుతం ఆధార్‌లో ఈమెయిల్ అడ్రస్ అప్‌డేట్ చేసుకోవడానికి వసూలు చేస్తున్న రూ.75 ఫీజును, ఆరు నెలల పాటు పూర్తిగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించింది. యూఐడీఏఐ ప్రకారం.. ఈ సదుపాయం 2026 జూలై 1 నుంచి డిసెంబర్ 31 వరకు అందుబాటులో ఉంటుంది. దీంతో ఆధార్ మొబైల్ యాప్ ద్వారా ఈమెయిల్ చిరునామాను ఉచితంగా అప్‌డేట్ చేసుకునే అవకాశం లభించింది. ఆధార్‌కు ఈమెయిల్ ఐడీ లింక్ చేసి ఉంటే, ఆధార్‌కు సంబంధించిన ముఖ్యమైన నోటిఫికేషన్లు, అప్డేట్స్, సర్వీసులకు సంబంధించిన సమాచారాన్ని వెంటనే పొందవచ్చు. వినియోగదారుల సౌలభ్యం కోసం, ఇటీవల ప్రారంభించిన ఆధార్ మొబైల్ యాప్‌లో మొబైల్ నెంబర్ అప్‌డేట్, అడ్రస్ అప్‌డేట్, బయోమెట్రిక్ లాక్/అన్‌లాక్, ఈ ఆధార్ డౌన్‌లోడ్, అథెంటికేషన్ హిస్టరీ చెక్ వంటి అనేక సేవలు అందుబాటులో ఉన్నాయి. ఉచిత ఈమెయిల్ అప్‌డేట్ సదుపాయం కేవలం ఆధార్ మొబైల్ యాప్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉంది. ఆన్‌లైన్‌లో ఈమెయిల్‌ను ధృవీకరించుకోవడానికి ఆధార్ నెంబర్, రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ వంటి వివరాలను నమోదు చేసి.. వెరిఫై ఈమెయిల్ అడ్రెస్ ఎంపికను ఎంచుకోవాలి. అయితే.. ఆరు నెలల తర్వాత ఈ ఫీజు మినహాయింపును కొనసాగించాలా? లేదా మళ్లీ ఫీజు అమలు చేయాలా అనే విషయంపై యూఐడీఏఐ నిర్ణయం తీసుకోనుంది. అయితే ప్రస్తుతానికి ఈమెయిల్ ఐడీ అప్డేట్ చేయనివారు నిర్ణీత సమయం లోపల ఉచితంగానే అప్‌డేట్ చేసుకోవచ్చు.

## కంపెనీని అమ్మేసి ఉద్యోగులను
# కోటీశ్వరులను చేశాడు!

సాధారణంగా కార్పొరేట్ ప్రపంచంలో మానవత్వానికి చోటు ఉండదు అనుకుంటాం. కానీ కరుణామయులైన వ్యాపారవేత్తలూ కొందరుంటారు. అలాంటి పారిశ్రామికవేత్త ఒకరు తన కంపెనీని అమ్మేసి ఆ సంస్థలో పనిచేసే ఉద్యోగులను కోటీశ్వరులను చేశారు. ఎవరాయన.. ఎక్కడ.. ఆ కంపెనీ ఏంటి.. చూద్దాం ఈ కథనంలో.. అమెరికాలోని లూసియానా రాష్ట్రానికి చెందిన కుటుంబ యాజమాన్య సంస్థ ఫైబర్‌బాండ్ తీసుకున్న ఒక నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. విద్యుత్ పరికరాలు, డేటా సెంటర్ మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక నిర్మాణాలను తయారు చేసే ఈ సంస్థను పవర్ మేనేజ్‌మెంట్ దిగ్గజం ఈటన్ 1.7 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.16,045 కోట్లు) కొనుగోలు చేసింది. అయితే ఈ ఒప్పందంలో అత్యంత విశేషమైన అంశం ఏమిటంటే.. సంస్థ మాజీ యజమాని గ్రాహం వాకర్ ఉద్యోగుల కోసం 240 మిలియన్ డాలర్లు (సుమారు రూ.2,265 కోట్లు) కేటాయించాలనే షరతును పెట్టడం. ఈ నిర్ణయంతో సంస్థలో పనిచేస్తున్న 540 మంది పూర్తి కాల ఉద్యోగులు ఈ మొత్తాన్ని పంచుకోనున్నారు. అంటే సగటున ఒక్కో ఉద్యోగికి 4.43 లక్షల డాలర్లు (సుమారు రూ.4.18 కోట్లు ) లభించనున్నాయి. కంపెనీలో వాటాలు లేకపోయినా, సంస్థ ఎదుగుదలలో ఉద్యోగుల పాత్రను గుర్తించి ఈ బహుమతిని ఇవ్వాలని వాకర్ నిర్ణయించారు. బోనస్ చెల్లింపులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. అయితే పూర్తి మొత్తాన్ని పొందాలంటే ఉద్యోగులు ఐదేళ్లపాటు సంస్థలో కొనసాగాల్సి ఉంటుంది. 65 ఏళ్లు దాటిన ఉద్యోగులకు మాత్రం ఈ నిబంధన నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ ప్రకటన వెలువడినప్పుడు చాలా మంది ఉద్యోగులు తొలుత నమ్మలేకపోయారని, కొందరు ఇది సరదా ప్రకటనేమోనని భావించారని అమెరికా మీడియా పేర్కొంది.

**అగ్నిప్రమాదం నుంచి ఏఐ బూమ్ వరకు...**

1982లో క్లాడ్ వాకర్ స్థాపించిన ఫైబర్‌బాండ్ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొంది. 1998లో ఫ్యాక్టరీ అగ్నిప్రమాదం, డాట్‌కామ్ సంక్షోభం, ఆర్థిక మందగమనం కారణంగా ఒక దశలో ఉద్యోగుల సంఖ్య 900 నుంచి 320కు పడిపోయింది. అయినప్పటికీ సంస్థ ఉద్యోగులను కాపాడుకునేందుకు యాజమాన్యం కృషి చేసింది. తరువాత డేటా సెంటర్ రంగంలో సుమారు 150 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టడం సంస్థకు టర్నింగ్ పాయింట్‌గా మారింది. కోవిడ్ అనంతరం క్లౌడ్ సేవలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) డేటా సెంటర్లకు భారీ డిమాండ్ ఏర్పడటంతో ఫైబర్‌బాండ్ వ్యాపారం వేగంగా విస్తరించింది. కేవలం ఐదేళ్లలో కంపెనీ అమ్మకాలు దాదాపు 400 శాతం పెరిగాయి. ఈ భారీ బోనస్‌తో అనేక మంది ఉద్యోగుల జీవితాలు మారిపోయాయి. కొందరు గృహ రుణాలను పూర్తిగా తీర్చగా, మరికొందరు చిన్న వ్యాపారాలు ప్రారంభించారు.




# కాక్రోచ్ పార్టీ సంచలన ఆరోపణలు!

**నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం, అవకతవకల నడుమ మరోసారి పరీక్షను నిర్వహించారు. అయితే దీనిపై కూడా దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. మరోవైపు కేంద్రం తీరును ఖండిస్తూ.. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఇప్పుడు సంచలన ఆరోపణలకు దిగింది..**




నీట్ యూజీ పేపర్ లీక్ వివాదంపై కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు, సోషల్ మీడియా ద్వారా ప్రాచుర్యం పొందిన అభిజిత్ దీప్కే.. నిరసనకారుల పట్ల అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జంతర్‌మంతర్‌లోని మరుగుదొడ్లకు వరుసగా రెండో రోజూ నీటి సరఫరా నిలిచిపోయిందని ఆయన ఆరోపించారు. నిరసనలకు వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయన సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు. అంతేకాకుండా నిరసనకారులకు నీళ్లు, అరటిపండ్లు పంపిణీ చేస్తున్న వారి ఆధార్ కార్డు వివరాలు, చిరునామాలు సేకరిస్తున్నారని ఢిల్లీ పోలీసులపై ఆరోపణలు చేశారు. ప్రజలకు సహాయం చేస్తున్న వారిని సైతం అనుమానాస్పదంగా చూడటం సరైంది కాదని అభిజిత్ పేర్కొన్నారు. జంతర్‌మంతర్‌లో నిరసనకారుల కోసం స్వచ్ఛంద సంస్థలు, మద్దతుదారులు లంగర్ ఏర్పాటు చేసి ఆహారం, లస్సీ పంపిణీ చేస్తున్నారు. అనేక మంది రాత్రంతా అక్కడే బస చేస్తుండటంతో చెప్పులు, సామాన్లు, పాత్రలు అక్కడే కనిపిస్తున్నాయి. పోలీసులు అనుమతి గడువు ముగిసిందని తెలిపినా.. ప్రత్యామ్నాయ వేదిక కేటాయించే వరకు తాము నిరసన కొనసాగిస్తామని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేశారు. నీట్ యూజీ లీక్ వ్యవహారంలో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపిస్తున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కూడా ఈ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈ ఉద్యమానికి తాజాగా రైతు సంఘాలు మద్దతు ప్రకటించాయి. మరోవైపు మహారాష్ట్రకు చెందిన సామాజిక కార్యకర్త జ్ఞానేశ్వర్ రఘునాథ్ థోరట్ ఈ నిరసనల్లో చేరడం హైలైట్ అయ్యింది. "విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతారు. కానీ కొందరి లాభం కోసం పరీక్షల విశ్వసనీయత దెబ్బతింటే అది లక్షలాది కుటుంబాలకు అన్యాయం చేసినట్టే" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ యూజీ పేపర్ లీక్ వివాదం ఇప్పటికే దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. మరోవైపు రీ టెస్ట్‌ను కూడా ఎన్‌టీఏ సరిగ్గా నిర్వహించలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తరుణంలో ఇప్పుడు జంతర్‌మంతర్ వేదికగా కొనసాగుతున్న నిరసనలు, కాక్రోచ్ జనతా పార్టీ చేస్తున్న ఆరోపణలు మరోసారి ఈ అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మార్చాయి. పరీక్షల పారదర్శకత, విద్యార్థుల భవిష్యత్తు, ప్రభుత్వ బాధ్యతలపై ప్రశ్నలు లేవనెత్తుతున్న ఈ ఉద్యమం ఇంకా ఎంత దూరం వెళ్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

## ఫిలిప్పీన్స్ స్కూల్‌లో కాల్పులు..
# ముగ్గురు మృతి



**మనీలా:** ఫిలిప్పీన్స్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. ఒక పాఠశాల లోపల దుండగులు జరిపిన విచక్షణారహిత కాల్పులు కలకలం రేపాయి. నిత్యం విద్యార్థుల సందడితో ఉండే క్లాస్‌రూమ్‌ల మధ్యే బుల్లెట్ల వర్షం కురవడంతో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘాతుకంతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా రక్తసిక్తంగా మారింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లోని టాక్లోబన్ సిటీ పరిధిలో గల 'బారంగే సాన్ జోస్' లోని ఒక పాఠశాలలో సోమవారం ఉదయం దాదాపు 9 గంటల సమయంలో ఈ దారుణ ఘటన జరిగింది. పాఠశాల ఆవరణలోకి చొరబడిన దుండగులు ఒక్కసారిగా తుపాకులతో విరుచుకుపడ్డారు. ఈ కాల్పుల్లో మొత్తం ఎనిమిది మందికి బుల్లెట్లు దూసుకెళ్లాయి. సమాచారం అందిన వెంటనే టాక్లోబన్ సిటీ పోలీస్ స్టేషన్ 1 అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని, సహాయక చర్యలు చేపట్టారు.

**ఒకరి అరెస్ట్.. మరొకరి కోసం వేట**

ఈ ఘటన అనంతరం పోలీసులు ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని మైనర్‌గా గుర్తించారు. ఈ దాడిలో పాల్గొన్నట్లు అనుమానిస్తున్న రెండో నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. నిందితులిద్దరూ స్థానిక బారంగే సాన్ జోస్ ప్రాంతానికి చెందినవారేనని ప్రాథమిక సమాచారం.

**ఆస్పత్రిలో క్షతగాత్రులు.. దర్యాప్తు ముమ్మరం**

ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఐదుగురిని చికిత్స నిమిత్తం తక్షణమే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మరణించిన వారి వివరాలను పోలీసులు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన తర్వాతే పేర్లను ప్రకటిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు.

# లక్నోలో భారీ అగ్నిప్రమాదం




**లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలోని అలీగంజ్ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ భవనంలోని దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా వ్యాపించి, అదే బిల్డింగ్‌లోని రెండో అంతస్తులో నడుస్తున్న ఒక కోచింగ్ సెంటర్‌ను ముంచెత్తాయి. దీంతో కోచింగ్ సెంటర్‌లోని విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణభయంతో పరుగులు తీశారు. కొందరు విద్యార్థులు ప్రాణాలను రక్షించుకునేందుకు భవనం పైనుంచి కిందకు దూకే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడ తీవ్ర తొక్కిసలాట చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంటలను అదుపులోకి తెచ్చేందుకు, భవనం లోపల చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు రెస్క్యూ టీమ్స్ శ్రమిస్తున్నాయి.

# బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా



**లండన్:** బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా చేశారు. స్టార్మర్ ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ ప్రకటన వెలువడి 24గంటల్లో కీర్ స్టార్మర్ ప్రధాని పదవికి రాజీనామా చేశారు. 2024లో బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ ప్రధానిగా రాజీనామా చేశారు. కీర్ స్టార్మర్‌తో కలిపి పదేళ్లలో ఆరుగురు ప్రధానులు తమ పదవికి రాజీనామా చేయడం గమనార్హం. రాజీనామాకు ముందు స్టార్మర్ తన భార్యతో కలిసి 10డౌనింగ్ స్ట్రీట్ నుంచి బయటకు వచ్చారు. అక్కడ ఆయన మద్దతు దారులు హర్షధ్వానాలు, చప్పట్లుతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రెండు సంవత్సరాల క్రితం డౌనింగ్ స్ట్రీట్‌లో అడుగుపెట్టిన క్షణాన్ని తన జీవితంలో అత్యంత గర్వించదగిన క్షణంగా కీర్ స్టార్మర్ గుర్తుచేసుకున్నారు. స్టార్మర్ తన రాజకీయ ప్రయాణాన్ని ప్రజల జీవితాలను మార్చాలనే లక్ష్యంతో ప్రారంభించానని పేర్కొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ సాధించిన అఖండ విజయాన్ని గుర్తుచేసుకుంటూ, తన ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన ప్రస్తావించారు. ఆర్థిక వృద్ధి, పెరుగుతున్న వేతనాలు, పెరిగిన పెట్టుబడులు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, తగ్గుతున్న ఎన్‌హెచ్ఎస్ నిరీక్షణ జాబితాలు, కార్మికులు, అద్దెదారుల హక్కులు, రక్షణ వ్యయం పెరుగుదల వంటి అంశాలను వివరించారు. నేను తీసుకున్న ప్రతి నిర్ణయం తొలి ప్రాధాన్యత దేశానికే. మా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. అభివృద్ధిలో మా సహచర దేశాల కంటే వేగంగా వృద్ధి సాధించాం. మేము అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతి నెలా ద్రవ్యోల్బణం కంటే వేగంగా వేతనాలు పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. అదే సమయంలో తమ విధానాల వల్ల ఐదు లక్షల మంది పిల్లలను పేదరికం నుండి బయటకు తీసుకువచ్చామని కూడా పేర్కొన్నారు. అయితే, వరుస వివాదాలు, విధాన మార్పులు, తగ్గుతున్న ప్రజా మద్దతు కారణంగా స్టార్మర్ ప్రధాని పదవి నుంచి వైదొలగాలనే డిమాండ్లు వినిపిస్తూ వచ్చాయి. 2024 ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసిన జీవన ప్రమాణాల మెరుగుదలను అందించడంలో ఆయన ప్రభుత్వం విఫలమైందని అంతర్గతంగా లేబర్ పార్టీలో విమర్శలు వెల్లువెత్తాయి. దీనికితోడు లేబర్ పార్టీ ప్రత్యర్థి ఆండీ బర్న్‌హామ్ పార్లమెంటరీ సీటు గెలుచుకోవడంతో కీర్ రాజీనామాపై మరింత ఒత్తిడి పెరిగింది. హౌస్ ఆఫ్ కామన్స్‌లో 100 మందికి పైగా లేబర్ చట్టసభ్యులు ఆయన రాజీనామా చేయాలని లేదా ఆయన నిష్క్రమణకు స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని బహిరంగంగా పిలుపునిచ్చారు.




# మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 23-06-2026




ANN తెలుగు

## తొక్కిసలాట కేసు వాయిదా.. బన్నీ తప్ప అందరూ హాజరు

'పుష్ప 2' ప్రీమియర్ సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ దగ్గర తొక్కిసలాట గురించి తెలిసిందే. ఓ మహిళ చనిపోగా, ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అయితే అప్పటినుంచి ఈ కేసు నడుస్తూనే ఉంది. సోమవారం విచారణకు హాజరు కావాలని నాంపల్లి కోర్టు, హీరో అల్లు అర్జున్‌కి సమన్లు జారీ చేసింది. కానీ ఇతడు తప్పితే కేసులో భాగమైన మిగిలిన వాళ్లందరూ హాజరయ్యారు. ఈ క్రమంలోనే కేసుని వచ్చే నెల 6వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. హాజరు కానందుకు అల్లు అర్జున్‌కి మెమో దాఖలు చేయాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. ఈ తొక్కిసలాట కేసులో A11గా ఉన్న బన్నీ వ్యక్తిగతంగా కోర్టుకి హాజరు కావాల్సింది. కానీ ఇతడి తరపున న్యాయవాది వచ్చారు. ముంబైలో షూటింగ్‌లో ఉన్న కారణంగా అల్లు అర్జున్ రాలేకపోయారు. ముంబైలో అట్లీ దర్శకత్వంలో తీస్తున్న 'రాకా' షూటింగ్‌లో బన్నీ బిజీగా ఉన్నాడు.




## సగం రెమ్యునరేషన్‌కే సినిమా చేసిన స్టార్ కమెడియన్

సాధారణంగా నటీనటులు ఎవరైనా సినిమా సినిమాకు రెమ్యునరేషన్ పెంచుకుంటూ పోతారు. కానీ కొన్నిసార్లు మాత్రం పారితోషికం తగ్గించుకోవడం లాంటివి చేస్తుంటారు. తాజాగా స్టార్ కమెడియన్ యోగిబాబు కూడా వరస సినిమాలు చేస్తున్నప్పటికీ ఓ మూవీకి మాత్రం సగం రెమ్యునరేషన్ తీసుకుని చేశాడు. ఇప్పుడీ విషయం చర్చనీయాంశంగా మారింది. నటుడు అర్జున్‌దాస్, అన్నాబెన్ జంటగా నటించిన చిత్రం కాన్‌సిటీ. యోగిబాబు, వీటీవీ.గణేశ్ తదితరులు ఇతర పాత్రలు చేశారు. హరీష్ దురైరాజ్ దర్శకనిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారమే (జూన్ 26) తెలుగు, తమిళంలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా చిత్ర ప్రీ రిలీజ్ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం చెన్నైలోని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన యోగిబాబు.. దర్శకుడు హరీష్‌తో తనకు చాలా కాలంగా పరిచయం ఉందని, ఆయన శ్రమ, అంకితభావం చూసి తను దర్శకుడు కావాలనేది తన కోరిక అని చెప్పారు. దర్శకుడు హరీష్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా దర్శకుడిని కావాలని అనుకున్నానని, దర్శకుడిగా అవకాశం రాగానే ఇందులో యోగిబాబును నటింపజేయాలని అనుకున్నానని.. ఆయన సగం పారితోషికంతోనే ఇందులో నటించినట్లు చెప్పారు.



# సమంతలో ఇంత సత్తా ఉందా.. ఈ కలెక్షన్స్ ఏంటి?


ఏదైనా సినిమా సరిగా ఆడకపోతే పలువురు తెలుగు దర్శకనిర్మాతలు.. నెపం ప్రేక్షకులు మీద లేదంటే రివ్యూయర్ల మీద తోసేస్తుంటారు. అంతే తప్పితే తాము సరిగా తీయలేదు, అందుకే ఆడలేదు, కలెక్షన్స్ రాలేదని మాత్రం ఒప్పుకోరు. ఇప్పుడు అలాంటి వాళ్లందరికీ సమంత చిన్నపాటి షాక్ ఇచ్చింది. ఎందుకంటే బంగారం ఊహించని విధంగా బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్లతో బరువెక్కుతోంది. ఇంతకీ ఇదెలా సాధ్యమైంది? ఒకప్పుడు సమంత స్టార్ హీరోయిన్. ప్రస్తుతానికి వస్తే హీరోయిన్‌గా ఓ సినిమా చేసి మూడేళ్లయింది. అది (ఖుషి) కూడా ఏమంత సరిగా ఆడలేదు. దీంతో 'మా ఇంటి బంగారం' ఆడుతుందా లేదా అనే విడుదలకు ముందు చాలా సందేహాలు. మరోవైపు జూన్ నెల మధ్యలో రిలీజ్, స్కూల్స్ తెరిచేశారు. ఫ్యామిలీ ఆడియెన్స్ వస్తారా అని డౌట్స్. దీనికి తోడు రివ్యూలు కూడా యావరేజ్‌గానే వచ్చాయి. కానీ సమంత తన మూవీపై అందరి అంచనాల్ని తారుమారు చేసింది. వీకెండ్ అయ్యేసరికి రూ.43 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ప్రస్తుతం సినిమాల పరిస్థితి ఏం బాగోలేదు. ఓ మాదిరిగా ఆడిన మూవీస్ రూ.2030 కోట్లు కూడా రాబట్టుకోలేకపోతున్నాయి. అలాంటిది హీరోలెవరూ లేకుండా సమంత మాత్రమే లీడ్ రోల్ చేసిన చిత్రానికి ఈ రేంజ్ వసూళ్లు రావడం నిజంగా ఆశ్చర్యమనే చెప్పొచ్చు. ఇది చూసి చాలామంది మిడ్ రేంజ్ హీరోలు కచ్చితంగా కళ్లుకుంటారేమో. ఎందుకంటే తమకు సాధ్యం కానిది ఓ హీరోయిన్ చేసి చూపించింది. దీనిబట్టి అర్థమైంది ఏంటంటే కంటెంట్ ఓ మాదిరిగా ఉన్నా జనాలు ఆదరిస్తారు. కాకపోతే అవసరం ఆర్భాటాలు లేకుండా కరెక్ట్‌గా తీయాలంతే. దర్శకనిర్మాతలు ఇది గుర్తుపెట్టుకుంటే బెటర్. మరోవైపు లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో అత్యధిక కలెక్షన్స్ అంటే అనుష్క 'అరుంధతి'కి రూ.68 కోట్లు వచ్చాయి. 'మా ఇంటి బంగారం' జోరు చూస్తుంటే ఈ నంబర్ దాటేసేలా కనిపిస్తుంది. ఒకవేళ అదే జరిగితే రికార్డ్ అవుతుంది. ఈ మూవీతో సక్సెస్ అందుకున్న సమంత ప్రస్తుతం ప్రెగ్నెన్సీతో ఉంది. అధికారికంగా చెప్పనప్పటికీ బేబీ బంప్ వీడియోలు వైరల్ కావడంతో ఈ సంగతి బయటపడింది.





### సైలెంట్ అయిపోయిన తమన్నా..
## తెలుగులో నో ఆఫర్స్

తమన్నా భాటియా .. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తన అందంతో అభినయంతో క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ అమ్మడు ఎక్కువగా తెలుగు, తమిళం, హిందీ చిత్రాలలో నటిస్తూ ఫుల్ బిజీగా మారిపోయింది. మూడు సంతోషం ఫిల్మ్ అవార్డులు, రెండు సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డులు, కళైమామణి అవార్డు సహా అనేక అవార్డులను గెలుచుకుంది. తెలుగులో తక్కువ సమయంలోనే పాపులర్ అయ్యింది తమన్నా. స్టార్ హీరోల సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అలాగే తమిళ్ లోనూ స్టార్ హీరోలతో నటించి హిట్స్ అందుకుంది. కానీ బాలీవుడ్ మీద ఫోకస్ పెట్టడంతో తెలుగులో ఆఫర్స్ తగ్గాయి. తెలుగులో ఈ చిన్నది అప్పుడెప్పుడో ఓదెల 2 సినిమాలో నటించింది. ఆతర్వాత మరో సినిమా చేయలేదు ఈ అమ్మడు. ప్రస్తుతం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరిస్తుంది తమన్నా. ఈ బ్యూటీ ఫోటోలకు ఫిదా అవుతున్నారు కుర్రకారు.



### పూజ హెగ్డేను పట్టించుకోవడం
## లేదే పాపం..

తర్వాత వరుసగా సినిమాలు చేసింది కానీ హిట్స్ అందుకోలేకపోయింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను కవ్విస్తుంది. అందాల భామ పూజా హెగ్డే స్పీడ్ తగ్గిందా..? అంటే అవును అనే సమాధానమే వినిపిస్తుంది. ఒకప్పుడు వరుస సినిమాలతో దూసుకుపోయింది ఈ భామ. మోడల్ గా కెరీర్ మొదలుపెట్టిన మోడల్, నటి. పూజ 2010 లో విశ్వసుందరి పోటీల్లో రెండో స్థానం లో నిలిచింది. 2014 లో ముకుంద సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయం అయింది. తరువాత ఒక లైలా కోసం సినిమాలో నటించింది. తెలుగు, తమిళ్ సినిమాలతో పాటు హిందీలోనూ నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది పూజా హెగ్డే. స్టార్ హీరోయిన్ గా రాణించింది. ఈ అమ్మడు తెలుగులో స్టార్ హీరోలందరి సరసన నటించి మెప్పించింది. కానీ ఈ మధ్య ఈ చిన్నదానికి బ్యాడ్ లక్ నడుస్తుంది. రీసెంట్ డేస్ లో పూజా హెగ్డే నటించిన సినిమాలన్నీ డిజాస్టర్స్ గా నిలిచాయి. దాంతో ఈ అమ్మడికి ఆఫర్స్ తగ్గాయి. తెలుగులో చివరిగా రాధే శ్యామ్ సినిమాలో నటించింది. ఆ సినిమా తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు పూజా.



### అందానికి కేరాఫ్ అడ్రస్
## ఆషికా రంగనాథ్..

ఆషికా రంగనాథ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. నందమూరి కళ్యాణ్ రామ్ 'అమిగోస్' సినిమాతో ఆషికా రంగనాథ్ టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అమిగోస్ సినిమా ఆశించిన స్థాయిలో ఆడకపోవడంతో కన్నడ ముద్దుగుమ్మ ఆషికా రంగనాథ్ కు ఎక్కువ పాపులారిటీ రాలేదు. కన్నడ సినిమాల నుంచి టాలీవుడ్ వైపు వచ్చిన బ్యూటీగా ఆషిక రంగనాథ్ కనిపిస్తుంది. 2016లో 'క్రేజ్ బాయ్'తో అక్కడ ఆమె ఎంట్రీ ఇచ్చింది. తాజాగా సంక్రాంతి సీజన్ లో కింగ్ అక్కినేని నాగార్జున హీరోగా నటించిన నా సామి రంగ సినిమాలో హీరోయిన్ నటించింది ఆషికా. ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేక పోయిన సంక్రాంతి సీజన్ రిలీజ్ అవ్వడంతో ఆడియన్స్ ఎక్కువగా సినిమా చూసారు దానితో పాపులారిటీ వచ్చింది ఆషికకు. అయితే ఈ సినిమా తర్వాత ఈ ముద్దుగుమ్మకు టాలీవుడ్ లో అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి అనుకున్నారు. అయితే స్తుతం తెలుగులో ఏ సినిమాలోనూ నటించడం లేదు. అయితే ఈ లేటెస్ట్ పిక్స్ చూసిన తరువాత ఆమె అభిమానుల జాబితాలో మరింతమంది చేరిపోవడం ఖాయమేనని అనిపిస్తుంది.


EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com